

Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 11.09.2015, శుక్రవారం
సంపుటి : 35 సంచిక : 15
పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com




> సెజ్‌ల పేరుతో ప్రభుత్వ భూములన్నీ భూబ్యాంక్‌లోకి...

> భవిష్యత్‌లో పంచడానికి సెంటు భూమి కూడా మిగలదు.



# రాష్ట్రంలో... 'భూం'ఫట్

**భూ బ్యాంక్... ఇప్పుడు కమర్షియల్ బ్యాంకులకన్నా ఈ బ్యాంకుకు విలువ పెరిగింది. పారిశ్రామిక ప్రపంచమంతా ఇప్పుడు భూమి చుట్టే తిరుగుతుంది. ఒకప్పుడు పేద రైతులకు భూమి లేనిదే భుక్తి ఉండేది కాదు. ఇప్పుడు పరిపాలకులది కూడా అదే పరిస్థితి. అయితే వీళ్లు భుక్తి కోసం కాకుండా ఆర్ధికంగా శక్తివంతులయ్యేందుకు భూములను దోచేస్తున్నారు.**

ఇంకొన్నేళ్లలో మనం మన రాష్ట్రంలో ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ, డికెటి, సిజెఎఫ్ఎస్ వంటి భూముల గురించి వినలేము. పేదోడికి పది అంకణాల పట్టాభూమి ఇవ్వాలన్నా, పేదరైతుకు వ్యవసాయం చేసుకోవడానికి అరఎకరా పొలం ఇవ్వాలన్నా భూమి అనేది కనిపించదు. నేడు ప్రభుత్వం అనుసరిస్తున్న భూసేకరణ విధానం వల్ల భవిష్యత్‌లో పేదలకు ఇచ్చేదానికి సెంటు భూమి కూడా మిగిలే పరిస్థితి లేదు.

అమరావతి, భోగాపురం, భావనపాడు, బందరు పోర్టు... ఇప్పటికే లక్షలాది ఎకరాల భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం... ఇక్కడ ప్రభుత్వం అనేకంటే చంద్రబాబు గ్రూపు కంపెనీ శ్రీకారం చుట్టిందనిపిస్తుంది. అమరావతి రాజధాని పేరుతో అతిపెద్ద భూకుంభకోణం జరుగుతోంది. ఇప్పటికే 30వేలకుపైగా ఎకరాల భూమిని తీసుకున్నారు. ఇంకా తీసుకోవాలని చూస్తున్నారు. ఈ ప్రాంతంలోనే కొన్ని వేల ఎకరాల అటవీ భూములను డీ-నోటిఫై చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అంటే చంద్రబాబు కంపెనీ రాజధాని కేంద్రంలోనే లక్ష ఎకరాల దాకా భూమిని గుప్పిట్లో పెట్టుకోవాలనుకుంటోంది. భోగాపురం, భావనపాడు, బందరులలోనూ భూ సేకరణ జరుగుతోంది. పచ్చటిపైర్లను నాశనం చేయొద్దని

(మిగతా 11వ పేజీలో)

## ఆప్తులు ఆత్మీయుల ఆనందోత్సాహాల నడుమ

# 'శీనయ్య'కు 'బెగోరె' అవార్డు

3లో



## • పట్టిసీమ...



# నిధులు కుమ్మరించి... నీళ్లు దొర్లించారు!

**ప**ట్టిసీమ... ఇదో కనికట్టు మహిమ. గోదావరి వరద జలాలను కృష్ణా నదిలో కలిపి రాయలసీమకు నీళ్లిస్తామంటూ చంద్రబాబు చేసిన మ్యాజిక్ పేరే పట్టిసీమ. రాష్ట్రంలో ఎన్నో పెండింగ్ ప్రాజెక్టులు ఉన్నాయి. వందకోట్లు ఖర్చుపెడితే కొన్ని, *500*కోట్లు ఖర్చుపెడితే మరికొన్ని పూర్తవుతాయి. వై.యస్. హయాంలో సగం సగం పూర్తయిన ప్రాజెక్టులు ఎన్నో ఉన్నాయి. చంద్రబాబు ప్రభుత్వం వాటి జోలికి పోలేదు. కొత్తగా పట్టిసీమ ప్రాజెక్ట్‌ను చేపట్టింది. *1300*కోట్లతో ఈ ప్రాజెక్ట్‌ను హడావిడిగా చేపట్టింది. ఓ పక్క కేంద్రం పోలవరం ప్రాజెక్ట్‌ను మంజూరు చేసింది. పోలవరం పూర్తయితే పట్టిసీమ నిరుపయోగంగా మారుతుంది. ఈ ఏడాదికాకున్నా ఇక రెండుమూడేళ్లకైనా పోలవరం పూర్తికాకుండా పోతుందా? అప్పుడు పట్టిసీమకు పెట్టిన *1300*కోట్లు నీళ్లల్లో వేసినట్లు కాదా?

(మిగతా 11వ పేజీలో)



# అడ్డదారిలో నీటి సంఘాల ఎన్నికలు

సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికల జీఓను ప్రభుత్వం అస్పష్టంగా తెచ్చిందని, ఏకపక్షంగా సాగునీటి సంఘాలను కైవసం చేసుకునేందుకు ప్రభుత్వం కుట్రపన్నుతోందని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ఈ నెల 8వ తేదీన నెల్లూరులోని తన ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రజాస్వామ్యయుతంగా నిర్వహిస్తే ప్రభుత్వం పరువు పోవడం ఖాయమన్నారు. ఏకాభిప్రాయం పేరుతో అక్రమంగా ఈ సంఘాల ఎన్నికలు నిర్వహిస్తే ఊరుకునేది లేదని, న్యాయం కోసం న్యాయస్థానాలనైనా ఆశ్రయిస్తామని అన్నారు. రైతులంతా కూడా సమావేశాలకు వెళ్లి పోటీచేసే వారి జాబితాను అందజేసి రశీదులు తీసుకోవాలన్నారు. రైతుల ఆమోదం లేకుండా ఏకగ్రీవంగా కమిటీలను ఎన్నుకోలేరని, పోటీపడే రైతులంతా సమావేశాలకు వెళ్లాలన్నారు. రాష్ట్ర శాసనసభ సమావేశాలు మొక్కుబడిగా జరిగాయని, సభలో ప్రజాసమస్యలు చర్చకు రాకుండా అధికార పార్టీ అడ్డుపడిందని ఆయన విమర్శించారు.

# ముత్తుకూరురోడ్డుకు మోక్షం!

కృష్ణపట్నంపోర్టు పుణ్యమా అని నెల్లూరు, ముత్తుకూరురోడ్డు అత్యంత ట్రాఫిక్ రద్దీతో ఉంటుంది. జిల్లాలో జాతీయ రహదారి తర్వాత ఎక్కువ ట్రాఫిక్ ఉంటున్న రోడ్డు ఇదే! ప్రతిరోజూ వేల సంఖ్యలో వాహనాలు ఈ రోడ్డు మీద ప్రయాణిస్తుంటాయి. దీనికి కారణం పోర్టుతో పాటు, విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు, పేరొందిన విద్య, వైద్య సంస్థలు ఈ రోడ్డు పక్కనే ఉండడం. కాబట్టి ట్రాఫిక్ బాగా పెరిగింది. అయితే ట్రాఫిక్‌కు అనుగుణంగా రోడ్డు విస్తరణ జరగలేదు.

గత ప్రభుత్వంలో నెల్లూరు-ముత్తుకూరు రోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా విస్తరించాలని నిర్ణయించారు. అయితే నెల్లూరులోని రామలింగాపురం సెంటర్ నుండి ధనలక్ష్మీపురం వరకు 7కిలోమీటర్ల పరిధిలోనే విస్తరణ పని పూర్తయ్యింది. ధనలక్ష్మీపురం నుండి పోర్టు దాకా ఇప్పుడు రోడ్డు విస్తరణకు అధికారులు సర్వే చేపట్టారు. ప్రస్తుతం వున్న రోడ్డు మధ్య నుండి ఇరవైరెండున్నర మీటర్ల వరకు ఇరువైపులా విస్తరించనున్నారు. రోడ్డు విస్తరణ జరిగితే కాకుపల్లి, బ్రహ్మదేవం, పిడతాపోలూరు, ముత్తుకూరు, కప్పల దొరువు వంటి గ్రామాలలో చాలా దుకాణాలు, వ్యాపార సంస్థలను ఖాళీ చేయించాల్సి వుంటుంది. అదీగాక రోడ్డు పక్కన స్థలాలకు కమర్షియల్ విలువ వస్తుందని చాలా మంది రోడ్ ఫేసింగ్ స్థలాలనే కొని పెట్టి వున్నారు. ఇప్పుడు రోడ్డు విస్తరణలో తమ స్థలాలు, దుకాణాలు, నివాసాలు పోతాయని వీరంతా ఆందోళన చెందుతున్నారు. అయితే పెరిగిన ట్రాఫిక్ దృష్ట్యా ముత్తుకూరు రోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా మార్చడం అత్యవసరం. కాబట్టి బాధితులకు ప్రత్యామ్నాయం చూపించి రోడ్డు విస్తరణను సత్వరం చేపట్టాల్సివుంది.




# షుగర్ ముదిరితే కిడ్నీలకు చేటు

షుగర్ పేషంట్లు అశ్రద్ధ వహిస్తే 80శాతం కిడ్నీ వ్యాధి గ్రస్తులవుతారని ఆంధ్రప్రదేశ్ నెఫ్రాలజి సొసైటి ఆధ్వర్యంలో నెల్లూరు చింతారెడ్డిపాళెంలోని నారాయణ మెడికల్ కాలేజీలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సదస్సులో వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ నెల 5వ తేదీ నెఫ్రాలజి సొసైటి రాష్ట్ర సదస్సును నారాయణ మెడికల్ కాలేజీలో ఏపి మెడికల్ కౌన్సిల్ ఛైర్మెన్ డా॥ రాజారావు ప్రారంభించగా, కౌన్సిల్ మాజీఅధ్యక్షులు డా॥ రామ్‌ప్రసాద్ గౌరవఅతిథిగా పాల్గొన్నారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి నారాయణ మెడికల్ కాలేజీ నెఫ్రాలజి విభాగాధిపతి ప్రొఫెసర్ కె.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 250మందికి పైగా నెఫ్రాలజిస్టులు, ఫిజిషియన్లు, పిజి విద్యార్థులు పాల్గొన్నారు. హైదరాబాద్ కేర్ హాస్పిటల్ డాక్టర్ రాజశేఖర్ చక్రవర్తి, తిరుపతి స్విమ్స్ ప్రొఫెసర్ శివకుమార్, రాయల్ హాస్పిటల్ యు.కె.నుంచి వచ్చిన డా॥ శ్రీధర్‌రెడ్డి, చెన్నై నుంచి వచ్చిన డా॥ బాలసుబ్రహ్మణ్యం, హైదరాబాద్ నుంచి వచ్చిన డా॥ శ్రీభూషణ్‌రాజు, నెల్లూరుకు చెందిన డా॥ ఎస్‌విఎల్ నారాయణరావు తదితరులు మధుమేహ వ్యాధి నివారణకు, తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి వివరించారు. సదస్సును ఆర్గనైజ్ చేసిన డా॥ కె.ప్రవీణ్‌కుమార్‌ను పలువురు అభినందించారు. ఈ సదస్సులో నారాయణ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డా॥ జి.వీరనాగిరెడ్డి, మెడికల్ డైరెక్టర్ డా॥ జి.సుబ్రహ్మణ్యం, సిఇఒ డా॥ విజయమోహన్‌రెడ్డి, నెఫ్రాలజిస్ట్ డా॥ వరప్రసాద్ పాల్గొన్నారు.

# ఊపిరి తీసిన విషవాయువు

## గ్యాస్ లీకై ముగ్గురు యువకులు దుర్మరణం

రెక్కాడితేగాని... డొక్కాడని పేద కుటుంబాలకు చెందిన ముగ్గురు యువకులు గ్యాస్ లీకై ప్రాణాలు కోల్పోవడంతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగి గుండెలవిసే వారి రోదనలు మిన్నంటాయి. గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. వివరాల్లోకెళితే నెల్లూరు జిల్లా తడ మండలం మాంబట్టు పారిశ్రామికవాడలోని ఇండస్ కాఫీ పరిశ్రమలో మంగళవారం ఉదయం పరిశ్రమలోని కాఫీ లిక్విడ్ స్టోరేజీ ట్యాంకును శుభ్రపరిచే క్రమంలో సూళ్లూరుపేటకు చెందిన తీరుపాక రవి(27), దొరవారిసత్రం మండలం కల్లూరుకు చెందిన చిట్టిబోయిన రవీంద్ర(21), తడ మండలం ఎస్ఎం కండ్రిగకు చెందిన చౌని ఈశ్వర్(24) ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు అపస్మారక స్థితిలోకి వెళ్లి ప్రాణాలతో బయటపడ్డారు. ట్యాంకులో పేరుకుపోయిన పదార్థాలను బయటకు తీసేందుకు యాజమాన్యం కార్మికులను సుమారు 15 అడుగులు ఎత్తు వున్న స్టీలు ట్యాంకులోకి దిగమని పంపారు. మూత తీసి ముందుగా రవి అనే కార్మికుడు తర్వాత రవీంద్ర దిగారు. కొన్ని క్షణాల్లోనే లోపలున్న గ్యాస్ కారణంగా ఆక్సిజన్ అందక పడిపోయారు. ఇది గమనించిన ఈశ్వర్ వారిని బయటకు లాగేందుకు లోపలికి దిగాడు. అతనూ ఊపిరాడక పడిపోయాడు. వీరిని కాపాడే క్రమంలో ట్యాంకుపైనున్న పోలయ్య, సాంబాచారి, బోసు గ్యాస్ కారణంగా కళ్ళు తిరిగి అపస్మారకస్థితికి చేరుకున్నారు. ఈలోగా సాయి అనే కార్మికుడు అరచి మిగిలిన కార్మికులను పిలిచాడు. తాళ్లు బెల్టులు సాయంతో వారిని బయటకు లాగాలని ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో గ్యాస్ కట్టర్‌తో ట్యాంకును కోసి లోపల అపస్మారక స్థితిలో వున్న ముగ్గురిని బయటకుతీసి 108లో సూళ్లూరుపేట ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రవి, రవీంద్ర, ఈశ్వర్ మరణించారు. ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. డిఎస్పీ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. బాధ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సబ్‌ఇన్‌స్పెక్టర్ల బదిలీ

నెల్లూరుజిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసుస్టేషన్లలో పనిచేస్తున్న ఎనిమిది మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సోమవారం జిల్లా ఎస్పీ డాక్టర్ గజరావు భూపాల్ ఉత్తర్వులు జారీ చేసారు. నెల్లూరు డిఎస్‌బిలో పనిచేస్తున్న కె.వి.నారాయణలను అనంతసాగరం పిఎస్‌కు, అనంతసాగరంలో పనిచేస్తున్న జి.పుల్లారావును కావలిరూరల్‌కు, కావలి రూరల్‌లో పనిచేస్తున్న ఎం.రఘునాథ్‌ను కావలి ఒకటవ పట్టణంకు, కావలి ఒకటవ పట్టణంలో పనిచేస్తున్న పి.విజయ్ శ్రీనివాస్‌ను డిసిఆర్‌బి నెల్లూరుకు బదిలీ చేసారు. నెల్లూరు డిసిఆర్‌బిలో పనిచేస్తున్న ఎం.పూర్ణచంద్రరావును ఆత్మకూరుకు, ఆత్మకూరులో పనిచేస్తున్న జి.వేణుగోపాలరెడ్డిని గూడూరు ఒకటవ పట్టణంకు, గూడూరు ఒకటవ పట్టణంలో పనిచేస్తున్న ఎం.బాబిని నెల్లూరు 4వ నగరంకు, నెల్లూరు నాలుగవ నగరంలో పనిచేస్తున్న కె.ప్రసాదరెడ్డిని నెల్లూరు మూడవ నగరంకు బదిలీ చేసారు. బదిలీ అయిన వారు వెంటనే విధుల్లో చేరాలని ఎస్పీ ఆదేశించారు.



# పేదలకు వైద్యసేవలు అందడం లేదు

లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో ఈ నెల 6వతేదీ ప్రభుత్వ వైద్యసేవలపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్రా శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చుపెడుతున్నా వైద్యసేవలు మాత్రం పేదప్రజలకు అందడం లేదన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ప్రజలకు సరైన వైద్యం అందడం లేదని, ప్రభుత్వ వైద్యులు సమయపాలన పాటించడం లేదని, పైఅధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడం వల్ల ఇలాంటి చర్యలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ వైద్యులు సొంతంగా ప్రైవేటు వైద్యశాలలు పెట్టుకుని రోగులను సొంత వైద్యశాలకు రాబట్టుకొని అందినకాడికి దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు.

ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు మక్కెన అంకయ్యచౌదరి, సిపి బాబురావు, ఎస్‌డి రసూల్, ఎంఎస్ మణి, ఎల్.కృష్ణవేణి, రాధిక, దీపిక, వై.వి.కిషోర్, ఎన్.వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రంగనాథుడి మంచి రాబడి

నెల్లూరు రంగనాయకులపేటలో వేంచేసియున్న శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలోని హుండీని లెక్కించగా భక్తులు స్వామివారికి కానుకల రూపంలో ఆరునెలల కాలానికి గాను రూ. 10,44,689లు సమర్పించారని ఆలయ కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ శైలేంద్రబాబు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ వారి హుండీ లెక్కింపు

నెల్లూరుజిల్లా చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం హుండీలను లెక్కించగా రూ.13,77,788లు లభించింది. 3నెలలా15రోజులు పాటు భక్తులు అమ్మవారికి కానుకల రూపేణా సమర్పించారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ రామమోహన్‌రెడ్డి, దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసబాబు, కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులురెడ్డి, మాజీఛైర్మెన్ సింహాద్రి, మనోహర్, ట్రస్టీలు నారాయణ, మదన్, జనార్ధన్, రామిరెడ్డి పాల్గొన్నారు.



# ప్రత్యేకహోదాపై పోరాడుతాం

ప్రత్యేకహోదా ఆంధ్రుల హక్కని, దానిని సాధించే దాకా పోరాడుతామని పిసిసి అధ్యక్షులు కొడవలూరు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. ప్రత్యేకహోదా ఇస్తామని ప్రజలను మోసం చేసిన బీజేపీ, తెలుగుదేశం పార్టీలపై కేసులు నమోదు చేయాలంటూ వీరు నెల్లూరు 1వనగర పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ధనుంజయరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల మనోభావాలను ఈ రెండు పార్టీలు దెబ్బతీసాయన్నారు. కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ మోసం చేసాయన్నారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ నాయకులు ఏ.సి.సుబ్బారెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, బర్నాబసు, ఖాదర్ బాషా, రాజేష్, పీరారెడ్డి, మునాఫ్, ముసవీర్, ముస్థిక్, మాధవరెడ్డి, మధు, చక్రవర్తి, చక్రధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆప్తులు, ఆత్మీయుల ఆనందోత్సాహాల నడుమ

# 'శీనయ్య'కు 'బెగోరె' అవార్డు



జె.యస్.రెడ్డికి అవార్డునందజేస్తున్న అతిథులు అతిరథులు


కుటుంబసభ్యుల ఆత్మీయ ఆనందోత్సాహాల మధ్య జె.యస్.రెడ్డి

ఆయన చదువుకున్నది అగ్రికల్చర్, వృత్తిరీత్యా కాంట్రాక్టర్... కానీ పదిమందికీ సాయపడాలన్నది ఆయన క్యారెక్టర్. జె.యస్.రెడ్డిగా అటు కర్నాటకలోనూ ఇటు నెల్లూరుజిల్లాలోనూ ఎందరికో సుపరిచితుడైన జక్కా శ్రీనివాసులురెడ్డి ఆయన చేసిన సేవలకు, చేస్తున్న సత్కార్యాలకు గుర్తుగా డా॥ బెజవాడ గోపాలరెడ్డి అవార్డుని సెప్టెంబర్ 6వ తేదీ అందుకున్నారు. ఆయన స్నేహితులంతా ఆప్యాయంగా పిలుచుకునే శీనయ్య అవార్డు సభ ఆయన మనస్సంత నిండుగా వచ్చిన ఆప్తులతో ఆయన హృదయమంత మెండుగా పాల్గొన్న ఆత్మీయుల నడుమ అత్యంత ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న యం.యల్.సి విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, గజల్స్ శ్రీనివాస్‌లు జె.యస్.రెడ్డి గుణగణాలను ఆయన సేవాస్ఫూర్తిని కీర్తించారు. శీనయ్య లాంటి వ్యక్తులు సమాజంలో వుంటే ప్రభుత్వాలు సైతం తమ బాధ్యతలు గుర్తుకు తెచ్చుకుని పనిచేస్తాయన్నారు. చిన్నారుల కోసం చిన్నపిల్లల పార్కు, కళారంగం కోసం టౌన్‌హాలు, క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల కోసం క్యాన్సర్ నిర్ధారణ కేంద్రం... ఇవన్నీ నెల్లూరుజిల్లా చరిత్రలో చిరస్మరణీయమైన ఘట్టాలుగా జె.యస్.రెడ్డి జీవితంలో మరపురాని మైలు రాళ్ళుగా మిగిలిపోతాయని అన్నారు.

డా॥ బెజవాడ గోపాలరెడ్డి గురించి మాట్లాడిన జె.వి.రెడ్డి గోపాలరెడ్డి వంటి మహనీయుని పేర అవార్డు అందుకోవడం ఓ ప్రసాదం లాంటిదని ప్రముఖ గాయకుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ అన్నాడంటే ఆ అవార్డుకు ఎంతటి ప్రాధాన్యత ఉందో అవార్డు పేరు కలిగిన వ్యక్తికి ఇంకెంతటి సమర్థత, సామర్థ్యం వున్నాయో వేరే చెప్పనక్కరలేదని అంటూ జె.యస్. రెడ్డికి ఇవ్వకుండానే ఈ అవార్డుకు ముగింపు పలుకుతామేమో అన్న అసంతృప్తి తనలో వుండేదని, ఈనాటితో ఆ కోరిక కూడా నెరవేరి అసంతృప్తి తొలగిపోయిందని అన్నారు. రేబాల, దొడ్ల, తిక్కవరపు, బెజవాడ వంటి ఎన్నో దాతృత్వ కుటుంబాలకు ధీటుగా జక్కా వేమిరెడ్డి వంటి వారు నెల్లూరీయుల పేరు నిలబెడుతున్నారన్నారు.

చదివింది వ్యవసాయమే అయినా పని కొచ్చేవి మనకి మంచి చేసేదీ పదిమందికి చేసే సాయమే అన్న సూక్తిని నమ్మిన జె.యస్.రెడ్డి అచ్చమైన రైతులాగా పంచెకట్టుతో ఈ కార్యక్రమంలో పాల్గొని ముందుగా తన మాతృమూర్తి శ్రీమతి జక్కా కామేశ్వరమ్మ పాదాలకి నమస్కరించి వేదికనలంకరించాడు. తన సోదరుడు జె.కె.రెడ్డితో పాటు అవార్డు కమిటీ అధ్యక్షుడు జె.వి.రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, విఠపు బాలసుబ్రహ్మణ్యం, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, గజల్స్ శ్రీనివాస్‌లు జె.యస్.రెడ్డిని డా॥ బెజవాడ గోపాలరెడ్డి అవార్డుతో సత్కరించారు. కమిటి కార్యదర్శి, సభ నిర్వాహకుడు బి.వి.నరసింహం సన్మానపత్రంతో గర్జించాడు. సభకు ముందు శ్రీ గురుకృపా కళాక్షేత్రం, ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యప్రదర్శనలు సభికులను ఆకట్టుకు న్నాయి. ప్రార్థనా గీతాన్ని ప్రముఖ సంగీత విద్వాంసురాలు జె.బాలార్క ఆలపించారు.

## కష్టపడడం ఎలాగో మా నాన్న నుండే నేర్చుకున్నా - జె.యస్.రెడ్డి



కష్టపడడం అంటే ఎలా వుంటుందో నాకు నేర్పింది మా నాన్నే అంటూ తన ఉపన్యాసాన్ని ప్రారంభించిన జె.యస్.రెడ్డి తాను డిగ్రీ చదివేరోజుల్లో సెలవు రోజుల్లో ఇంటికి వస్తే తన చేత నాగలి పట్టించి దుక్కి దున్నించే వాడని, మన పని మనం చేసుకోవడంలో ఎంత కష్టపడినా తప్పులేదన్న సూక్తిని తన నాన్నే తనకు బోధించాడని చెప్పాడాయన. ఓర్పు, శాంతి, సహనం అన్నవి కూడా మా అమ్మ నుండి నేర్చుకున్నాం. ఈరోజు నాయీ అవార్డు స్వీకరణ మహోత్సవానికి విచ్చేసిన ఎంతోమంది హితులు, స్నేహితులు, సన్నిహితులు అందరికీ పేరు పేరునా తన కృతజ్ఞతలు తెలిపారు. తన నాన్నగారి పేర ఏర్పాటు చేసిన 'జక్కా రంగారెడ్డి కళాపీఠం' కార్యక్రమాలకు వేదికగా పురమందిరాన్ని ఆధునీకరించే అవకాశం తనకిచ్చిన రేబాల కుటుంబీకులకి ధన్యవాదాలు తెలిపారు. తన వదిన పేర జక్కా సుజాతమ్మ క్యాన్సర్ ఆసుపత్రి, అలాగే చిన్నపిల్లల పార్కు నిర్మించడానికి అప్పట్లో ఏర్పడిన పరిస్థితులను తనను ప్రేరేపించిన సంఘటనలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నాడు. ఏ పనిచేసినా నీ ఊరు మెచ్చిందా, నీ కన్నతల్లికి నచ్చిందా అన్న విషయాలు దృష్టిలో పెట్టుకుని చేస్తే అంతా మంచే జరుగుతుందన్న ఓ హితుడి సలహాని ఎల్లవేళలా పాటిస్తూ తన ఈ కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు. తనను ఈ స్థాయికి తీసుకొచ్చిన తన మిత్రులకు తన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుకుంటూ ముఖ్యంగా తన అభివృద్ధిలో నిత్యం భాగం పంచుకుని తనకి అన్ని విషయాలలో తోడు నీడగా వుండిన తన సహధర్మచారిణి శ్రీమతి జక్కా సౌదామినిని తలచుకుని భావోద్వేగానికిలోనయ్యారు. తనను విడిచి ఆరేళ్ల క్రితం కీర్తిశేషురాలైన ఆమెను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

గోపాలరెడ్డి గారితో తనకున్న కొద్దిపాటి పరిచయంతోనే ఆయన నుండి ఎన్నో విషయాలు నేర్చుకున్నానని, ఆయన వంటి గొప్ప వ్యక్తి పేర ఏర్పాటు చేసిన ఈ అవార్డుకి తనని ఎంపిక చేసిన కమిటీ వారికి ఈ సందర్భంగా తన కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు.

## ఇరుకళలమ్మకి పుష్పాభిషేకం



శ్రావణమాసం మూడవ శుక్రవారం సందర్భంగా భక్తుల శుభకార్యములందు తొలిపూజలందుకునే నెల్లూరు మూలాపేటలో వెలసియున్న సింహపురి గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో పుష్పయాగం నేత్రపర్వంగా జరిగింది. ప్రత్యేకంగా హోమాలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం శాస్త్రోక్తంగా అర్చకులు విశేషపుష్పాలతో పుష్పాభిషేకాన్ని జరిపించారు. వివిధ రకాల పుష్పాలను అమ్మవారికి సమర్పించి భక్తులకు కనువిందు చేశారు. గర్భాలయంలో అమ్మవారికి విశేషంగా చందనాలంకారం జరిగింది. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకాలను నిర్వహించారు. మహిళలు విశేషంగా పాల్గొని సామూహిక కుంకుమపూజలు చేసారు. పుష్పయాగ మహోత్సవానికి గంగిశెట్టి సాయికుమార్ ఉభయకర్తగా వ్యవహరించారు. ఆలయ నిర్వహణాధికారి ఎ.వి.శ్రీనివాసులురెడ్డి ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## యాత్రజిని ప్రథమ వార్షికోత్సవం



యాత్రజిని... ట్రావెల్స్ రంగంలో ఓ సంచలనం. అతి తక్కువ ఖర్చుతో ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చే రవాణా సంస్థ. నెల్లూరుకు చెందిన 40ఏళ్ల యువకుడు కోమిట్ల రెనిల్ కుమార్‌రెడ్డి ఏడాది క్రితం స్థాపించిన సంస్థ ఇది. నెల్లూరు నగరంతోపాటు ఆంధ్రా, తెలంగాణలో అన్ని జిల్లాల్లోని ప్రయాణీకులకు యాత్రజిని బస్‌లు, క్యాబ్స్ సేవలందిస్తున్నాయి. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలోనూ ఈ సంస్థ బస్, క్యాబ్స్ ప్రయాణీకులకు తక్కువ ధరకే అందుబాటులో ఉంటున్నాయి. ఈ నెల 13వ తేదీతో ఈ సంస్థను ప్రారంభించి ఏడాదవుతుంది. ఈ సందర్భంగా ఆరోజు మధ్యాహ్నం 3గంటలకు అయ్యప్పగుడి నుండి మినీబైపాస్ మీదుగా క్యాబ్స్, బస్సులతో ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని యాత్రజిని సిబ్బంది కోరుతున్నారు.

## ఘనంగా గోకులాష్టమి





నెల్లూరు, కొండాయపాలెంరోడ్డులోని ఇస్కాన్ మందిరంలో జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో రాజధాని కమిటి సభ్యులు బీద మస్తాన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉదయం జరిగిన కార్యక్రమంలో ఇస్కాన్ వారు రూపొందించిన శ్రీ కృష్ణ జన్మాష్టమి ప్రత్యేక సంచికను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ గజరావ్‌భూపాల్ పాల్గొని అభిషేకం, ఊయలసేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ ఆర్కేడ్ అధినేత యం.రాధాకృష్ణయ్య జగన్నాథ, బలదేవ, సుభద్రలకు నూతన వస్త్రాలు, మందిరానికి 5 వెండి కలశాలు, గిన్నెలు అందజేశారు.

ఆదేరోజు సాయంత్రం నగర మేయర్ అబ్దుల్ అజీజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని 'ఆధ్యాత్మిక శిక్షప్రద నాటికలు' తెలుగు పుస్తకాన్ని ఆవిష్కరించి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు సహకరించిన దాతలను సత్కరించడంతో పాటు ఇస్కాన్ నిర్వహించిన అనేక పోటీలలో విజేతలుగా నిలిచిన పలువురు చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కావలి వ్యవసాయ మార్కెటింగ్ ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం-మస్తానమ్మ దంపతులతో పాటు 'లాయర్' వారపత్రిక సారధి శివ ప్రభాత్‌రెడ్డి, జిల్లా జైలు సూపరింటెండెంట్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

6వ తేదీ మందిరంలో జరిగిన నందనోత్సవంలో నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈసారి జరిగిన ఉత్సవాలలో భక్తులు భారీసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### సహకార బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా

## శివరామకృష్ణ ప్రసాద్‌రెడ్డి



ఆంధ్రప్రదేశ్ కేంద్ర సహకార బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నెల్లూరుజిల్లా వింజమూరుకు చెందిన యత్తపు శివరామకృష్ణప్రసాద్‌రెడ్డి ఎన్నికయ్యారు. నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆవరణలో ఈనెల 6వ తేదీ జరిగిన అభినందన కార్యక్రమంలో శివరామకృష్ణ ప్రసాద్‌ని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి సత్కరించారు. అలాగే మిగతా కార్యవర్గ సభ్యులను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇంకా ఏపి నిర్వహణా అధ్యక్షుడు రత్నప్రసాద్, తెలంగాణ రాష్ట్ర నిర్వహణా అధ్యక్షుడు బి.ఎల్.ఎన్.రాజు, అసోసియేషన్ ఉపాధ్యక్షులు కొండారెడ్డి, బ్యాంకు సిఇవో రమణారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

# పేదల విప్లవం

హార్దిక్ పటేల్... ఈరోజు దేశవ్యాప్తంగా మార్మోగుతున్న పేరు. దేశంలోని ప్రతి రాష్ట్రానికి పాకిన పేరు. 22ఏళ్ల ఈ యువకుడు ఒక విప్లవాన్ని రగిల్చాడు. తరతరాలుగా కొన్ని వర్గాల ప్రజల్లో పేరుకుపోయిన అసంతృప్తిని లావాలా విరజిమ్మేలా చేసాడు. ఈ అసంతృప్తి ఎక్కడో ఒక చోట ఎవరో ఒకరి రూపంలో బయటపడాల్సిందే! ఇప్పుడు హార్దిక్ పటేల్ రూపంలో అది బయటపడింది.

ప్రజలంతా సమానమేనని ప్రభుత్వాలు చెబుతుంటాయి. మన రాజ్యాంగం అదే చెబుతుంది.అయితే అదే ప్రభుత్వం నువ్వు ఎస్సీ, నువ్వు ఎస్టీ, నువ్వు రెడ్డి, నువ్వు కమ్మ, నువ్వు యాదవ్ అని ప్రజలను కులాల వారీగా విడదీసి చూస్తుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలవుతుంటే ఈ కులాల అంతరాలు పెరిగాయేగాని తగ్గింది లేదు. రాజకీయ పార్టీలే ఓట్ల కక్కుర్తితో కులతత్వాన్ని ఎగదోస్తూ ప్రజలను కులాల వారీగా చీలుస్తూ తమ ఓటు బ్యాంకులను పదిలపరచుకుంటున్నాయి.

స్వాతంత్ర్యానికి ముందు భారతదేశంలో వున్న సామాజిక పరిస్థితులు వేరు. కొన్ని కులాల వారు అణచివేతకు గురయ్యారు. స్వాతంత్ర్యానంతరం అణచివేయబడ్డ కులాల వారిని ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విద్యా, ఉద్యోగ అవకాశాలలో దళిత, వెనుకబడిన వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించారు. అసమానతలు తొలగిపోతే పదేళ్ల తర్వాత ఈ రిజర్వేషన్లు ఎత్తేయాలని అప్పుడే ఆయన సూచించారు. అయితే కాలక్రమంలో ఈ దేశ పరిపాలనా సంస్కృతిలో రిజర్వేషన్లు ఒక భాగమై పోయాయి. రిజర్వేషన్లను తొలగించే ధైర్యం ఏ ప్రభుత్వానికీ లేదు. ఏ పార్టీ సాహసించదు. ఇంకా కొత్తగా కొన్ని కులాలకు, మతాలకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. ఇక్కడ ఒక్క విషయం అందరూ గమనించాలి. విద్యా, ఉద్యోగ అవకాశాలలో దళితులకు, బలహీనవర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించడానికి అగ్రవర్ణాల రాజకీయ నాయకులే ముందుంటుంటారు. కాని ఇదే నాయకులు పార్లమెంటు సీట్లలోనూ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలలోనూ ఇదే నిష్పత్తిలో ఈ వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించాలని ఎప్పుడైనా అడిగారా? ఎందుకంటే దళితులు, బలహీనవర్గాల ప్రజలు రిజర్వేషన్లకు పరిమితమై అక్కడితో సంతోషపడాలి. వీరి పదవులు మాత్రం వీరికి పదిలంగా ఉండాలి.

విద్యా, ఉద్యోగ అవకాశాలలో దళితులకు, బలహీనవర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించడానికి అగ్రవర్ణాల రాజకీయ నాయకులే ముందుంటుంటారు. కాని ఇదే నాయకులు పార్లమెంటు సీట్లలోనూ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలలోనూ ఇదే నిష్పత్తిలో ఈ వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించాలని ఎప్పుడైనా అడిగారా? ఎందుకంటే దళితులు, బలహీనవర్గాల ప్రజలు రిజర్వేషన్లకు పరిమితమై అక్కడితో సంతోషపడాలి. వీరి పదవులు మాత్రం వీరికి పదిలంగా ఉండాలి.

స్వతంత్ర భారతదేశంలో కూడా ప్రభుత్వాలు ప్రజలను కులాల వారీగా విభజించి పథకాలు, ప్రయోజనాలు అందజేస్తున్నాయి. దళితుడైన కోటీశ్వరుడి కొడుక్కి వందకు 30మార్కులొచ్చినా మెడికల్ సీటు వస్తుంది. పూటకు గతిలేని నిరుపేద బ్రాహ్మణుడికి వందకు 95మార్కులు వచ్చినా సీటు రాదు. ఈ అసంతృప్తి దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ వుంది. ప్రభుత్వాలు ప్రజలను కులాలవారీగా కాకుండా ధనిక, మధ్యతరగతి, పేదవర్గాలుగా విభజించి పేదవారి వృద్ధికి కృషి చేసివుంటే ఈ దేశం ఎప్పుడో బాగుపడివుండేది. కాని ఆ విధంగా చూసే మనసు మన పాలకులకు లేదు. రిజర్వేషన్ల మూలంగా ప్రతిభావంతులైన పేద విద్యార్థులు చదువుకునే అవకాశాలు లేక, చదువులు కొనలేక కూలీలుగా మారే పరిస్థితులొచ్చాయి. ఇది అగ్రవర్ణాలలో పుట్టి శాపగ్రస్తులైన పేదవారికి కడుపుమండించే విషయం. గతకొన్ని దశాబ్దాలుగా అగ్రవర్ణాలనే ముద్రవేసిన కొన్ని కులాలలోని నిరుపేదలకు ఈ అన్యాయం జరుగుతూనే వుంది. అగ్రవర్ణాలనే కొన్ని కులాలలో పుట్టడమే వీరు చేసిన తప్పా? అలా అయితే ఒక అవకాశం ఇవ్వండి. హిందూ మతం నచ్చకుంటే ఇంకో మతంలోకి మారడానికి మన రాజ్యాంగంలో అవకాశం కల్పించారు. అదే విధంగా పుట్టిన కులం భవిష్యత్‌కు ప్రతిబంధకంగా మారినప్పుడు బ్రతుకుదెరువు చూపించే కులంలోకి మారే అవకాశం కూడా కల్పించండి. రాజ్యాంగాన్ని సవరించైనా ఈ పని చేయండి. మతం మారే స్వేచ్ఛ ఉన్నప్పుడు కులాన్ని కూడా మార్చుకునే స్వేచ్ఛ ఎందుకుండ కూడదు. కులాల పేరుతో నిరుపేద ప్రతిభావంతుల భవిష్యత్‌ను ప్రభుత్వాలు ఇలాగే కాలరాసుకుంటూ పోతే ప్రతి రాష్ట్రంలోనూ హార్దిక్‌పటేల్ వారసులు తయారవుతారు. పోరాటబాట పడతారు. తరతరాలుగా అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని ఎవరూ తప్పు పట్టరు. అయితే కోట్లు సంపాదించిన వాళ్లకు కూడా రిజర్వేషన్లు ఏంటనేదే పేదవారి ప్రశ్న. ఈరోజు అంతరానితనం కులాలలో కంటే ఆర్థిక అసమానతలలోనే వుంది. కోటీశ్వరులంతా కులాలకతీతంగా ఒకరకమైన సామాజికహోదా పొందుతుంటే కూటికి గతిలేని వాళ్లు మాత్రం ఆర్థిక అంటరానితనానికి గురవుతున్నారు.

ఎవరికైనా పుట్టినప్పుడు తన కులమేంటో తన మతమేంటో తెలియదు. తప్పటడుగులు దశ దాటిబడి వైపు అడుగులు వేసే దాకా కూడా తల్లిదండ్రులు తమ పిల్లలకు మనది ఫలానా కులం, ఫలానా మతం అని చెప్పరు. పిల్లాడు తొలిసారిగా తన కులాన్ని తన మతాన్ని తెలుసుకునేది స్కూల్ అడ్మిషన్ దరఖాస్తును నింపేటప్పుడే! ఓ పక్క, కులాలు పోవాలని, అదే స్కూల్‌లో పాఠాలు బోధిస్తూ, మరి అక్కడే కులాల వివరాలు నమోదు చేయడమేమిటి? ప్రతి మనిషిలో కులమనే విషబీజాన్ని 'అ, ఆ'లు దిద్దించకముందే నాటుతున్నారు. మరి ఏ విధంగా కులతత్వం పోతుంది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఈ ఏడు దశాబ్దాలలో పాలకులు కులాలను ఉద్ధరిస్తామని, మతాలను ఆదరిస్తామని చెప్పారు. ఇక వృత్తుల వారీగా కూడా ఆశలు కల్పించారు. రైతుల సంక్షేమం కోసం పాటు పడతామంటారు, మహిళా జగతిని ఉద్ధరిస్తామంటారు. పారిశ్రామిక, వ్యాపారవర్గాల వారిని ప్రోత్సహిస్తామంటారు... ఇంతమందిని ఉద్ధరిస్తామనేవాళ్లు పేదల కోసం ఇది చేస్తామని ఒక్క మాట కూడా చెప్పరు.

ఈ దేశంలో ఆయా కులాల కన్నా ఆయా మతాలలోకన్నా పేదరికం అనే కులంలోనే 80శాతం మంది జీవిస్తున్నారు. వీరిలో దళిత, బలహీన, మైనార్టీలతో పాటు రెడ్లు, కమ్మ, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ వంటి ఎన్నో అగ్రవర్ణ ముద్రపడ్డ కులాల వాళ్లు కూడా ఉన్నారు. కులం కూడుపెట్టదనేది వీరందరి అభిప్రాయం. కాబట్టి తాము పుట్టిన కులాన్ని తమ పాలిటశాపంగా మార్చకుండా తమ బ్రతుకులను, భవిష్యత్‌ను కులం పేరుతో కాలరాయకుండా, తమ పేదరికాన్ని, తమలోని ప్రతిభను గుర్తించి ఈ దేశంలో బ్రతికే అవకాశం కల్పించాలనేది ఈ పేదరిక కులంవారి కోరిక. వీరి కోరిక ఆచరణకు రావాలంటే ఇంకెన్ని దశాబ్దాలు గడవాలో...?

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



పినాకిని యూత్‌వెల్ఫేర్ అసోసియేషన్, నెహ్రూ యువకేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ నెల్లూరు తిప్పరాజువారి వీధిలోని ప్రముఖ సినీగాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నివాసంలో మాజీ ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ బాలు తల్లిగారు ఎస్పీ శకుంతలమ్మ మాట్లాడుతూ జ్ఞానం అనేది పుట్టుకతోనే వస్తుందని, విజ్ఞానం మాత్రం విద్య ద్వారా వస్తుందన్నారు. అటువంటి విద్యను పదిమందికి పంచుతూ విద్యార్థులను చైతన్యవంతం చేస్తున్న ఉపాధ్యాయుని పాత్ర సమాజంలో ఎంతో ప్రాముఖ్యమైందని, అటువంటి ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను నేటితరం వారు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమసేవలు అందించిన ఉపాధ్యాయులు కె.వి.సుబ్బారెడ్డి(అల్లూరు), భట్టు రమేష్‌బాబు (నెల్లూరు), చీదరాల చెన్నయ్య(బుచ్చి), వి.తనూజ(నెల్లూరు)లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు కె.మురళీ మోహన్‌రాజు, అచ్యుత సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు పడాలని 'దువ'



నెల్లూరుజిల్లా ముస్లిం యూత్ సేవాకమిటి ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు కోటమిట్ట అమినియమద్రసలో వర్షాలు పడాలని, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని మద్రస లోని పిల్లల చేత 'దువ' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవా కమిటీ అధ్యక్షుడు ఖాలీద్, మున్న, అబుజర్, అమినియ మసీదు ఇమాం హాఫీజ్, ఇసాక్, అల్తాఫ్, జమీర్, ఎజాస్ పాల్గొన్నారు.

## ప్రఖ్యాత తెలుగు శాస్త్రవేత్తలను గుర్తించలేమా?

ఇటీవల మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారి విగ్రహాన్ని నాగార్జున విశ్వవిద్యాలయంలో, ఒంగోలులోని ఐఐటిని అబ్దుల్ కలాం గారి పేరుతో, అలాగే ప్రతిభా పురస్కారాలను కూడా వారి పేరుతోనే ఇవ్వనున్నట్లు ప్రకటించారు. మరి తెలుగుజాతి యావత్తూ గర్వించదగ్గ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శాస్త్రవేత్తలు డా॥ ఎల్లాప్రగడ సుబ్బారావు, డా॥ ఎలవర్తి నాయుడమ్మ గార్ల మాటేమిటి. భీమవరంలో జన్మించిన డా॥ సుబ్బారావు ప్రపంచలోనే ఏ ఒక్కరూ కనిపెట్టనన్ని మందులు కనుగొని "మందుల మాంత్రికుడిగా" ప్రసిద్ధికెక్కారు. వీరి స్మారకంగా నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి గవర్నమెంట్ వైద్యకళాశాలలో విగ్రహం నెలకొల్పడం ఎంతైనా సమంజసం. వీరి విగ్రహం వల్ల భావితరాల వారు స్ఫూర్తి పొందగలరు. అలాగే, ప్రజా శాస్త్రవేత్తగా అంతర్జాతీయ చర్మ పరిశోధనలో అగ్రగణ్యుడుగా పేరుపొందిన ఎలవర్రు(గుంటూరుజిల్లా) వాస్తవ్యులు డా॥ ఎలవర్తి నాయుడమ్మ శాస్త్ర రంగానికి, దేశానికి ఎనలేని సేవలు చేశారు. వారి సేవలకు గుర్తింపుగా తిరుపతిలోని ఐఐటికి వారి పేరు నామకరణం చేయడం సబబుగా వుంటుంది. ప్రస్తుతం రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న 'తెలుగు'దేశం మన తెలుగువారిని గుర్తించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

– డా॥ ఎ.జగదీష్, నెల్లూరు.

## దళిత క్రైస్తవ రిజర్వేషన్లు

ఇటీవల కొంతమంది దళిత క్రైస్తవ నాయకులు రాజ్యాంగ చట్టం షెడ్యూల్ కులాల ఉత్తర్వులు 1950ని సవరించి దళిత క్రైస్తవులను కూడా షెడ్యూల్ కులాలలో చేర్పించాలని ఆందోళన చేస్తున్నారు. ఇది ఎంత మాత్రం సమంజసం కాదు. క్రైస్తవం విదేశీ మతం. జైన, బౌద్ధ, సిక్కు స్వదేశీ మతాలు. క్రైస్తవ మతము ఏకేశ్వరోపాసనను సమర్థిస్తుంది. ఇప్పటికే అధికసంఖ్యలో క్రైస్తవులు ప్రభుత్వరికార్డులలో హిందువులుగా నమోదుకాబడి, దళితులకిచ్చే సౌకర్యాలను అనుభవిస్తున్నారు. ఇంకొంతమంది రహస్యంగానూ, బహిరంగానూ క్రైస్తవమతాన్ని స్వీకరిస్తున్నారు. దళిత హిందువులకు మాత్రమే రాజ్యాంగం కల్పించిన సౌకర్యాలు అమలుకావాలి.

ఆలూరి ఆత్మానందం, నెల్లూరు.


## ఇదేమి అలర్జీ!

కొంతమందికి కొన్ని పదార్థాలు అంటే అలర్జీ! మరికొంతమందికి కొన్ని వాసనలు పడవు, అలర్జీ వస్తుంది. కొన్ని పదాలు వింటే అలర్జీ రావడం ప్రథమంగా ఇప్పుడే చూస్తున్నాం. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీకి "ప్రత్యేకహోదా" అనే పదం గిట్టదు. ఆ పదం వింటే అలర్జీ వస్తోంది. అందుకే అంటాడు మీకు పుణ్యముంటుంది, ప్రత్యేకహోదా అనే పదం నా చెవిన పడకూడదు. నాకు అలర్జీ, ప్రత్యేకప్యాకేజీ ఎంతైనా ఇస్తా! అని వాపోతున్నాడు.

కురుగూరు రంగనాథం, నెల్లూరు.

## ర్యాగింగ్ రాక్షసత్వం

మన దేశంలోని అనేక కళాశాలల్లో చట్టరీత్యా నిషేధించబడిన ర్యాగింగ్ సంస్కృతి మళ్లీ పేట్రేగిపోతుంది. చాలామంది విద్యార్థులు ఈ ర్యాగింగ్ మూలంగానే ఆత్మహత్యలు చేసుకున్నారు. కొంతమంది ఉన్నతచదువులకు మధ్యలోనే స్వస్తి చెబుతున్నారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారికి కఠినమైన శిక్షలు విధించే చట్టాలున్నప్పటికీ అమలు కావడం లేదు. ఈ కేసులు కోర్టుకొచ్చేటప్పటికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. సీనియర్లు తమ జూనియర్లకు ఏదన్నా సందేశం ఇవ్వాలనుకుంటే అది సామాజిక సేవాకోణంలో చేయొచ్చు. తమ జూనియర్ల చేత సమాజం హర్షింపజేసే పనులు చేయించొచ్చు. దీనివల్ల అందరిలోనూ పరివర్తన వస్తుంది. ర్యాగింగ్ చేసే విద్యార్థులకు సామాజిక బాధ్యత తక్కువ. అందరూ కలిసి విద్యాసంస్థల నుండి ర్యాగింగ్ రాక్షసిని తరిమికొట్టడానికి కృషి చేయాలి.




పెండేల రాజశేఖర్, నెల్లూరు.



# డేంజర్ డెంగ్యూ

***ఎబోలా, ఆంత్రాక్స్ వంటివి తప్పితే మిగతా ప్రాణాంతక వ్యాధులన్నీ కూడా నెల్లూరుజిల్లాకు సునాయాసంగా వ్యాపిస్తుంటాయి. ముదురు దోమలు, బలిసిన పందులు కారణంగా ఈ రెండు వ్యాధులు సోకేపనైతే నెల్లూరులో అసలు మనుషులే ఉండేవాళ్లు కాదేమో!***

ఇంతకుముందు ప్రతి ఏటా ఒక సీజన్‌లో డెంగ్యూ, చికున్‌గున్యా, అతిసార, మెదడువాపు వ్యాధులు నెల్లూరుకు చుట్టంచూపుగా వచ్చి పలకరించిపోతుండేవి. నెల్లూరులో ఆసుపత్రులను నడిపించడానికి, డాక్టర్లను బ్రతికించడానికన్నట్లుగా ఈ రోగాలొస్తుండేవి. ఈ రోగాల మూలంగా డాక్టర్లు, ల్యాబ్‌ల వాళ్లు, మందులషాపుల వాళ్లు నాలుగు రూపాయలు సంపాదించుకుంటుండేవాళ్లు. గతంలో అప్పుడప్పుడూ పలుకరించే రోగాలు ఇప్పుడు నెల్లూరులో శాశ్వతంగా తిష్టవేసినట్లుగా కనిపిస్తున్నాయి.

నెల్లూరులో విషజ్వరాలు వీరవిహారం చేస్తున్నాయి. వైరల్ ఫీవర్‌తో పాటు డెంగ్యూ జ్వరాలు జనాన్ని భయపెడుతున్నాయి. జిల్లాలో పెద్ద సంఖ్యలోనే డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. నెల్లూరు నగరంలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా వుంది. మురికి కాలువల్లో సిల్టు తీసే దిక్కు కూడా లేక దోమలు విజృంభిస్తున్నాయి. రాత్రివేళల్లోనే కాక పగలు కూడా ఇళ్లల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పగలు కుట్టే ఈజిప్ట్ ఎడిస్ అనే దోమ చాలా ప్రమాదకరం. దీనివల్లనే డెంగ్యూ జ్వరాలు వ్యాపిస్తున్నాయి. నెల్లూరులో ఇటీవల డెంగ్యూ కేసులు ఎక్కువవుతున్నాయి. ఈ జ్వరాలకు నెల్లూరులో తగిన వైద్యం లేకపోవడంతో చెన్నై, హైదరాబాద్ నగరాలకు పోవాల్సి వస్తుంది. కూలీ నాలి చేసుకుని బతికే కుటుంబాల వారికి ఇలాంటి విషజ్వరాలు వస్తే అప్పులన్నా చేయాలి, ఆస్తులన్నా అమ్ముకోవాలి. చాలామంది పేదకుటుంబాలలో వాళ్లు ఈ జ్వరాలు సోకి మెరుగైన వైద్యం చేయించుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారు.

నెల్లూరు నగరపాలకులను నగర ప్రజలు ఒకటే కోరుతున్నారు. నాలుగు లైన్ల రోడ్లు అక్కర లేదు, ఉద్యానవనాలు పల్లేదు, అందమైన స్వాగతద్వారాలు అవసరం లేదు... ముందు దోమలను అరికట్టి మా ప్రాణాలను కాపాడండి చాలు... అంటున్నారు. మరి నగరాన్ని సుందరబృందావనంగా, మొఘల్ గార్డెన్ అంత అందంగా చేస్తామంటున్న పాలకులు మరి దీనికి ఏమంటారో...?


## దుగరాజపట్నంపై...
# మొలకెత్తుతున్న ఆశలు

***గత యూపిఏ ప్రభుత్వంలోనే వాకాడు మండలం దుగరాజపట్నం వద్ద ఓడరేవు మంజూరైంది. అయినా మధ్యలో ఎన్నో అభ్యంతరాలు వచ్చాయి. షార్ సెంటర్‌కు భద్రత సమస్య వస్తుందని ఇస్రో వాళ్లు ఆక్షేపణ చేసారు. అలాగే అటవీ, పర్యావరణశాఖ పరంగా కూడా అడ్డంకులొచ్చాయి. వీటన్నింటిని క్లియర్ చేసాకే గత యూపిఏ ప్రభుత్వం ఈ పోర్టుకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఈ పోర్టు నిర్మాణానికి యూపిఏ ప్రభుత్వంలో శంకుస్థాపన మాత్రం చేయలేకపోయారు. విభజన బిల్లులో కూడా దుగరాజపట్నం పోర్టును చేర్చడం జరిగింది.***

కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక ఈ పోర్టును సాధించే దిశగా గట్టి ప్రయత్నమంటూ జరగలేదు. ఈలోగా కొందరు నాయకులు మాత్రం ప్రకాశంజిల్లా రామాయపట్నం వద్దకు పోర్టును మార్చాలంటూ డిమాండ్ చేస్తున్నారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ పరిస్థితి దుర్భరంగా మారింది. ఐటి ప్రాజెక్టులు హైదరాబాద్‌కే పరిమితమయ్యాయి. ఆంధ్రాకు ఒక్క ప్రాజెక్ట్ కూడా వచ్చే అవకాశాలులేవు. చంద్రబాబు పుణ్యమా అని తెలుగు సినిమా పరిశ్రమ కూడా హైదరాబాద్‌లోనే స్థిరపడిపోతుంది. చంద్రబాబు కొంత చొరవతీసుకుని వుంటే సినీ పరిశ్రమ వైజాగ్‌కో లేక నెల్లూరుజిల్లా కన్నా తరలి రావడానికి అవకాశముండేది. ఇక చంద్రబాబు అమరావతి రాజధాని అంటున్నాడుగాని అది ఈ కాలంవాళ్లు చూసేది లేదు, పెట్టేదీ లేదు. మన రాష్ట్రానికి ఉన్న అవకాశమల్లా పారిశ్రామికాభివృద్ధి. అది కూడా ప్రత్యేకహోదా వస్తే ఆ దిశగా అవకాశాలుంటాయి. ఈ పారిశ్రామిక ప్రగతికి కూడా ఎక్కువ అవకాశం ఉండేది నెల్లూరుజిల్లాలోనే. ఎందుకంటే ఇక్కడ భూముల సమస్య లేదు. రాజకీయ బెదిరింపులు ఉండవు. ముఖ్యంగా చెన్నై-బెంగుళూరు, విశాఖ-చెన్నై కారిడార్‌లో నెల్లూరుజిల్లా ప్రధాన భాగంగా ఉండబోతుంది. కృష్ణపట్నం పోర్టు వచ్చాక కర్నాటకలో వున్న పారిశ్రామికవేత్తలు సైతం తమ ఎగుమతులు, దిగుమతులకు ఈ పోర్టునే ఆశ్రయిస్తున్నారు. చెన్నై, ఎన్నూర్‌పోర్టులు ఇప్పటికే రద్దీగా వుంటున్నాయి. విదేశాల నుండి వచ్చిన నౌక పదిరోజుల దాకా అన్‌లోడింగ్, లోడింగ్ కోసం సముద్రంలోనే ఉండాల్సి వస్తుంది. చెన్నై రోడ్లుపై నిత్యం ట్రాఫిక్ జామ్ వుంటుంది. పరిశ్రమలకు రవాణా పెద్ద సమస్యగా వుంది. దీనివల్లనే చాలా కంపెనీలు తమ ఎగుమతులు, దిగుమతులను కృష్ణపట్నం పోర్టు ద్వారా సాగిస్తున్నాయి. చెన్నైసిటీ దగ్గరగా వుండడం, చెన్నై, రేణిగుంట ఎయిర్‌పోర్టులు దగ్గరగా వుండడం నెల్లూరు జిల్లాకు కలిసొచ్చే అంశం. కాబట్టి పారిశ్రామిక ప్రగతి ఇక్కడే ఎక్కువుగా కేంద్రీకృతం కాబోతుంది. ఈ నేపథ్యంలో దుగరాజపట్నంపోర్టు కూడా అవసరం అవుతుంది. కాబట్టి ఈ ఓడరేవు కల ఈరోజు కాకున్నా రేపైనా సాకారం కావాల్సిందే!




జన్మదిన శుభాకాంక్షలు



సింహపురి నగరంలో యాత్రాజిని బస్ ట్రావెల్స్ మరియు యాత్రాజిని క్యాబ్స్
ప్రారంభించి ఏడాది అయిన సందర్భంగా
విజయోత్సవ సంబరాలు జరుపుకుంటున్న
యాత్రాజిని సి.ఇ.ఓ
కోమిట్ల రెనిల్ కుమార్‌రెడ్డి గారికి
వార్షికోత్సవ మరియు 40వ సంవత్సర జన్మదిన శుభాకాంక్షలు.
భవిష్యత్‌లో మరెన్నో విజయాలను అందుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ...


--- మీ... ఆత్మీయ శ్రేయోభిలాషులు ---

కొండూరు హరినారాయణరెడ్డి - సత్యవతి, నెల్లూరు.
కోడూరు శ్రీహరిరెడ్డి - సురేఖ, హైదరాబాద్
సి.ఇ.ఓ, కోమిట్ల ట్రావెల్స్
శ్రీకాంత్, శ్రావ్య
బండ్ల శ్యాంప్రసాద్ - సునీత, హైదరాబాద్
వైస్ ప్రెసిడెంట్, యాత్రాజిని
సిద్ధు
కొండూరు వంశీకృష్ణారెడ్డి - సుజాతలక్ష్మి
సీనియర్ టీమ్ లీడర్, జి.ఇ, హైదరాబాద్
సాయి హర్షిల్, సాయి హన్సిని

# నెల్లూరు కబుర్లు

## నగరంలో చవితి సందడి

ఏడాదిలో వచ్చే మిగతా పండుగలకు, వినాయకచవితి పండుగకు ఓ తేడా వుంది. మిగతా పండగలన్నీ ఎవరి ఇళ్లల్లో వాళ్లు చేసుకుంటారు. వినాయకచవితిని మాత్రం సెంటర్ల వారీగా పోటాపోటీగా నిర్వహిస్తుంటారు. జనం నుండి వసూలు చేసిన చందాల తోనే ఈ వేడుకలను ఆర్భాటంగా చేస్తుంటారు. ఈ నెల 17వ తేదీన వినాయకచవితి నేపథ్యంలో నెల్లూరులోని అన్ని ప్రాంతాల్లో చందాల వసూళ్లు జరుగుతున్నాయి. ఈసారి అన్ని వస్తువుల ధరలు పెరిగినట్లే చందాల వసూళ్లు కూడా రెట్టింపు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే రోడ్ల మీద చెక్‌పోస్టులు పెట్టినట్లుగా రాళ్లు, తాళ్లు అడ్డం పెట్టి వాహనదారుల నుండి చందాల రూపంలో డబ్బులు గుంజుతున్నారు. నిజంగా ఉత్స వాలు చేసేవారు కొందరైతే, చవితి పేరుతో చందాలు వసూలుచేసి వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవాళ్లు మరికొందరున్నారు.



## రాంజీ వాస్తు సంజీవని ఆవిష్కరణ

ప్రముఖ వాస్తు పండితులు వాస్తు రామచంద్ర రచించిన 'రాంజీ వాస్తు సంజీవని' పుస్తకాన్ని ఈ నెల 6వ తేదీన గొలగమూడిలోని భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమంలో ఆశ్రమ ఇఓ బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఆవిష్కరించారు. సామాన్యులకు సైతం అర్థమయ్యేలా ఈ పుస్తకంలో వాస్తు విశేషాలు వివరించారని బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత వాస్తు రామచంద్రతో పాటు డాక్టర్ ఓ.గోపాలకృష్ణ, డాక్టర్ మల్లికార్జునరెడ్డి, గొరిపేని వెంకయ్య, కనమర్లపూడి బాబు, కోసూరు రత్నం, కట్టా ప్రభాకరరెడ్డి, నాగిరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా సత్యంజీ సేవలు



రాష్ట్ర వ్యాప్తంగా రియల్‌ఎస్టేట్ రంగంలో సత్యంజీ గ్రూప్ సేవలను విస్తరించనున్నామని సత్యంజీ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సత్యనారాయణ తెలిపారు. తమ సంస్థ 8వ వార్షికోత్సవం సందర్భంగా సత్యంజీ గ్రూప్ ప్రధానకార్యాలయంలో ఈ నెల 5వ తేదీ శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ సాధారణ, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో డిటిసిపి అప్రూవ్ లేఅవుట్లు వేసి నెల్లూరులో టౌన్‌షిప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలో తిరుపతి, విజయవాడ, వైజాగ్, హైదరాబాద్‌లలో బ్రాంచీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సింహపురి పెయింట్స్ అధినేత కోట గురుబ్రహ్మం, హోటల్ అభిరామ అధినేత పచ్చిపులుసు శ్రీరాములు, వి.ఆర్ కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకులు శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు. శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని టిటిడి అర్చకులు వేదగిరి ఫణిశర్మ నేతృత్వంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న వారందరికి తీర్థ అన్నప్రసాదాలను అందజేశారు.

## ఉపాధ్యాయులకు సన్మానం



లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదీ నెల్లూరు డిఆర్ ఉత్తమ హోటల్‌లో టీచర్స్‌డే సందర్భంగా తెలుగుపండితులు నాశిన రామయ్య, గంగాఫణీంద్ర, హిందీ పండిట్ కొండేపి గిరిజాకుమారిలను జర్నలిస్టు డే సందర్భంగా ఎపియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఎ.జయప్రకాష్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు తోట నాగరాజు, కార్యదర్శి కొండా ప్రవీణ్‌శంకర్, కోశాధికారి ఆర్.హజరత్‌బాబు క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## పేదోళ్ళకు గ్యాస్ కనెక్షన్లు



ప్రభుత్వం పేదలందరికీ సెక్యూరిటీ, రెగ్యులేటర్ ఫీజులు లేకుండా రూ. 1650కే ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయనుందని నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ తెలిపారు. జిల్లాలో 1.60లక్షల మంది తెల్లకార్డులు ఉన్న పేద కుటుంబాలకు 2016 మార్చిలోగా ఈ గ్యాస్ కనెక్షన్‌ను అందించనున్నామని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్‌కనెక్షన్ లేని పేదలు ఇంకా 1.64లక్షల మంది ఉన్నట్లు గుర్తించామన్నారు. వారందరికీ గ్యాస్ కనెక్షన్లు అందిస్తామన్నారు. ఆధార్‌కార్డు, తెల్ల రేషన్‌కార్డులు కలిగిన వీరంతా తమ సమీపంలోని వివిధ గ్యాస్ ఏజెన్సీలు, పౌరసరఫరాల శాఖ, ఎంపిడివో తదితర కార్యాలయాల్లో గ్యాస్ కనెక్షన్ల కోసం ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2016-17 సంవత్సరంలోగా జిల్లాను కిరోసిన్ రహిత జిల్లాగా మార్చేందుకు వందశాతం పేదప్రజలకు గ్యాస్‌కనెక్షన్లు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి టి.ధర్మారెడ్డి, సిఎస్‌డిటి మనోహర్ బాబు, హెచ్‌పిసిఎల్ గ్యాస్ కంపెని ప్రతినిధి గోపినాయక్, ఐఓ సిఎల్ గ్యాస్ కంపెనీ ప్రతినిధి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

## హెల్మెట్ ఫిటింగ్

ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ల నిమిత్తం నెల్లూరులోని ఆర్టీవో ఆఫీసుకు వచ్చే వాళ్లు హెల్మెట్‌లు పెట్టుకుని రావాలని డిటిసి శివరామప్రసాద్ ఫిటింగ్ పెట్టారు. 7వ తేదీ నుండి దీనిని అమలులోకి తెచ్చారు. హెల్మెట్ లేనోళ్లకు ఎల్ఎల్ఆర్, లైసెన్సులు మంజూరు చేయడం లేదు. దీంతో ద్విచక్రవాహనదారులు చచ్చినట్లు హెల్మెట్ కొనుక్కోవడమో, తాత్కాలికంగా స్నేహితుల వద్ద వున్నవి తీసుకెళ్లడమో చేస్తున్నారు.

## డ్రగ్స్ కంట్రోల్ ఏడి బదిలీ

జిల్లా ఔషధ నియంత్రణశాఖ సహాయ సంచాలకులు శ్రీరామ్మూర్తి తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. తూర్పుగోదావరి జిల్లా ఏడిగా పనిచేస్తున్న సురేష్‌ను నెల్లూరుజిల్లా సహాయ సంచాలకులుగా బదిలీ చేసారు. శ్రీరామ్మూర్తి నెల్లూరులో 2011 నుండి ఏడిగా పనిచేశారు.

## నెల్లూరు తడిచింది

సెప్టెంబర్‌లో కూడా మే నెలను తలపించే ఎండలు కాస్తున్నాయి. నెల్లూరు ప్రజలకు మే నెల ఫీలింగ్ ఇంకా పోలేదు. అయితే కాస్తున్న ఎండల నుండి ఉపసమనం కలిగిస్తూ ఆది, సోమ, మంగళవారాలలో మంచి జల్లులు పడ్డాయి. వాతావరణం కొంత చల్లబడింది. మండే ఎండలు ఇక్కడితో ఆగిపోతే బాగుండునని, ఏసి లేసుకుని కరెంట్ బిల్లులు కట్టలేక ఛస్తున్నామని జనం బాధపడుతున్నారు.

## రెడ్‌క్రాస్ సమావేశం 29కి!

రెడ్‌క్రాస్ సొసైటి నెల్లూరు శాఖ జీవితకాల సభ్యుల సమావేశాన్ని ఈ నెల 29వ తేదీకి వాయిదా వేసినట్లు జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదట ఈ నెల 5వ తేదీన ఈ సమావేశం పెట్టాలనుకున్నారు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల 29కి వాయిదా వేసారు.

## యోగా అసోసియేషన్ అధ్యక్షునిగా రామచంద్రప్రకాష్

యోగా అసోసియేషన్ ఆఫ్ నెల్లూరు జిల్లా అధ్యక్షునిగా పి.రామచంద్రప్రకాష్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల్లూరు సంఘమిత్ర స్కూలులో నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ప్రకాష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి మనోహరం, నూతన కార్యదర్శిగా వివిఎస్‌ఎస్ సెల్వం, కోశాధికారిగా ఎస్‌కె ఖయ్యూం ఎన్నికయ్యారు.

## స్కేటింగ్ బంగారం



ఈ ఏడాది జన వరిలో పూణేలో నిర్వహించిన జాతీయ స్థాయి స్కేటింగ్ రింక్-1 పోటీలలో నెల్లూరు, హరనాథ పురంలోని రత్నం హై స్కూల్‌లో 6వ తరగతి విద్యార్థిని బుర్లా సంజన అత్యంత ప్రతిభ కనపరచి బంగారు పతకం సాధించింది. ఈ విద్యార్థినిని హైస్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్, డైరెక్టర్ రమ, ఉపాధ్యాయులు అభినందించారు.

## బస్‌పాస్‌లు విద్యార్థుల చెంతకే

దూరప్రాంతాల్లో ఉండే విద్యార్థులు చింతపడవద్దని, మీ చెంతకే బస్‌పాస్‌లు అందజేసే ప్రక్రియను ఆర్టీసీ ఏర్పాటు చేసిందని ఆర్టీసీ నెల్లూరు డిపో-1 మేనేజర్ సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. డిపో పరిధిలో విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు 2600వరకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. పెయిడ్‌పాస్‌లు 3600 వరకు ఇచ్చామన్నారు. ఇప్పటివరకు ఉచిత బస్‌పాస్‌లు తీసుకోని విద్యార్థులకు ఈనెల 30వతేదీ వరకు గడువు ఇచ్చినట్లు తెలిపారు. **పాస్‌లు ఇచ్చే తేదీలు:** ఈ నెల 15వ తేదీన నెల్లూరు డికెడబ్ల్యూ కళాశాలలో, 16న చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, 18, 19తేదీల్లో బుచ్చిరెడ్డిపాళెం బస్టాండు, 22న కలువాయి శివసాయి జూనియర్ కళాశాలలో, 23న కుల్లూరు జూనియర్ కళాశాలలో, 24, 26తేదీలలో పొదలకూరు ఆర్టీసీ బస్టాండులో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇవ్వనున్నట్లు మేనేజర్ తెలిపారు.

## ఉచిత శిక్షణా శిబిరం



నెల్లూరులోని నిరుద్యోగులకు వైద్యసంబంధిత కోర్సులకు సంబంధించి ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నట్లు వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్, చీసర్స్ చైర్‌పర్సన్ టి.వసంతలక్ష్మి తెలిపారు. ఈ నెల 5వ తేదీ తన ఛాంబర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ పదవ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన వారికి బెడ్‌సైడ్ నర్సింగ్ కోర్సు, పదవ తరగతి పాసైన వారికి ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు, ఇంటర్మీడియట్ పాసైనవారికి ఎక్స్‌రే టెక్నీషియన్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. శిక్షణాకాలం మూడు నెలలు ఉంటుందని, కోర్సు పూర్తి చేసినవారికి మెప్మా సహకారంతో పరీక్షలు నిర్వహించి ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికేట్‌ను అందజేస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రముఖ హాస్పిటల్లలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. 18 నుంచి 40సంవత్సరాలలోపు వయస్సు వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 0861-2356266, 8886670840 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

## మాట నిలబెట్టుకున్న బాబు

ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా కాపు, బలిజ, తెలగ ఒంటరి కులాల సంక్షేమానికి వందకోట్లు విడుదల చేసి మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఆంధ్రప్రదేశ్ కాపునాడు అధ్యక్షులు వి.పి.నారాయణస్వామి రాయల్ కృతజ్ఞతలు తెలిపారు. 6వ తేదీ నెల్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బలిజలను బీసీలలో చేర్చే విధంగా ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులను ఇవ్వాలని కోరారు. ప్రత్యేకహోదా కోసం ఆత్మత్యాగం చేసిన రామిశెట్టి లక్ష్మయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో కాపునాడు జిల్లా అధ్యక్షులు పసుపులేటి వెంకటేశ్వర్లు, నగర అధ్యక్షులు పి.శ్రీనివాస్, కార్యదర్శి జి.ప్రసాద్‌రావు, వెంకటరత్నం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# 'ఐక్లిక్'తో నేరాలకు చెక్

**- డీజీపీ రాముడు**

ఈ నెల 6న రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ) జె.వి.రాముడు తడలో ఎస్‌బిఐ ఏటిఎం పక్కన ఏర్పాటు చేసిన ఐక్లిక్ యంత్రాన్ని శ్రీసిటి ఛైర్మెన్ శ్రీనిరాజు, యండి రవీంద్ర సన్నారెడ్డి సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డీజీపీ ప్రజలు ఎటువంటి సమస్యలైనా ఫిర్యాదు చేసేందుకు నేరుగా పోలీసుస్టేషన్‌కే వెళ్లాల్సిన పనిలేదని, బాధితుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన 'ఐక్లిక్' యంత్రం ద్వారా చాలా సులువుగా తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చన్నారు. ఐక్లిక్ కేంద్రం స్థాపనకు అవసరమైన నిధులను సమకూర్చినందుకు శ్రీసిటీ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమాల్లో గుంటూరు ఐజీ ఎన్.సంజయ్, జిల్లా ఎస్పీ గజరావ్ భూపాల్, గూడూరు డిఎస్పీ శ్రీనివాస్, సూళ్లూరుపేట సిఐ విజయ్‌కృష్ణ, తడ ఎస్సై సురేష్‌బాబు పాల్గొన్నారు.

# విద్యతోనే దేశాభివృద్ధి

మంచి విద్య, విజ్ఞానంతోనే దేశం అభివృద్ధి చెందుతుందని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే భావిభారత పౌరులను తయారుచేసే బాధ్యత ఉపాధ్యాయుల చేతుల్లోనే వుందని జిల్లా కలెక్టర్ యం.జానకి అన్నారు. ఈ నెల 5వ తేదీన నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జరిగిన గురుపూజో త్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రాథమిక పాఠశాల స్థాయి నుండే విద్యార్థు లకు క్రమశిక్షణ అలవడేలా ఉపాధ్యా యులు కృషి చేయాలన్నారు. పిల్లలకు తల్లి దండ్రులు జన్మనిస్తారని, వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దే ది మాత్రం ఉపాధ్యాయులే నన్నారు. జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘ వేంద్రరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ



వృత్తికే వన్నె తెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్‌ను ప్రతి ఉపాధ్యాయుడు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. శాసనమండలి సభ్యులు విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఉన్నత విలువలను ఆచరిస్తూ విద్యార్థులకు మార్గదర్శకులు, మార్గనిర్దేశకులు కావాలన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామీణ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయవృత్తి ఎంతో పవిత్రమైనది, విలువైనదని, ప్రపంచంలో ఎటువంటి వారి ఉన్నతికైనా ప్రత్యక్ష, పరోక్ష కారకులు వారి గురువులేనన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు జాయింట్ కలెక్టర్ సాల్మన్‌రాజ్‌కుమార్, డిఇఓ ఆంజనేయులు, రాజీవ్‌విద్యామిషన్ పి.ఓ కోదండరామిరెడ్డి, కార్పొరేటర్ దాసరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ ఆశయాలను నెరవేరుస్తాం

**- గజల్ శ్రీనివాస్**




గాంధీ ఆశయాలకు విస్తృత ప్రచారం కల్పించి నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండ లంలోని పల్లెపాడు సత్యాగ్రహ ఆశ్రమానికి ప్రపంచస్థాయి గుర్తింపు తెస్తామని ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు.

ఆదివారం నెల్లూరులోని రెడ్‌క్రాస్ సొసైటీలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అమెరికాకు చెందిన గ్రీట్‌వే ఇండియా సంస్థ, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆశ్రమ అభివృద్ధికి నిధులు సమకూర్చేందుకు వివిధ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈమధ్య తాను గ్రీట్‌వే ఇండియా సంస్థ ప్రచారకర్తగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా సంస్థ విక్రయించే గ్రీటింగ్ కార్డులకు అవసరమైన చిత్రాల కోసం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఉత్తమ చిత్రాలతో రూపొందించిన గ్రీటింగ్ కార్డులను విక్ర యించడం ద్వారా ప్రపంచ శాంతి సాధనకు ప్రచారం చేయాలనేది ఈ కార్యక్రమ లక్ష్యం అన్నారు. సంస్థకు వచ్చే ఆదాయంలో 15శాతాన్ని ఆశ్రమ అభివృద్ధికి కేటాయిస్తామన్నారు. తొలి విడతగా నెల్లూరుజిల్లాలో పోటీలు ప్రారంభిస్తామన్నారు. 4 నుంచి 15ఏళ్ల బాలబాలికలు చిత్రలేఖన పోటీలలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ నెల 26వ తేదీ నెల్లూరు నగరంలోని ఎంపిక చేసిన ప్రైవేట్ పాఠశాలల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. అక్టోబర్ 2న పల్లెపాడు గాంధీ ఆశ్రమంలో జిల్లాలోని రూరల్ ప్రాంతాల్లోని పిల్లలకు పోటీలు నిర్వహిస్తా మన్నారు. 4-7 ఏళ్ల వారు సబ్‌జూనియర్లు గాను, 8-11ఏళ్ల వారు జూనియర్లుగాను, 12-15 ఏళ్లవారు సీనియర్లు విభాగాల్లో పోటీలలో పాల్గొనవచ్చన్నారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు కన్సొలేషన్ బహుమతులుగా 5మందికి వెయ్యి రూపాయలు వంతున అందజేస్తామన్నారు. నగరంలో జరిగే పోటీలలో పాల్గొనే విద్యార్థులు ఆయా పాఠశా లల్లో పేర్లు నమోదు చేసుకోవాలని, రూరల్ ప్రాంతాలకు చెందిన వారు ఈ నెల 30లోగా గూడూరు లక్ష్మి 9441638900 నెంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం కన్వీనర్ గణేశం కృష్ణారెడ్డి, డాక్టర్ ఎవిఎస్ సుబ్రహ్మణ్యం, గూడూరు లక్ష్మి, రొంపిచర్ల శివరామయ్య, ప్రైవేటు స్కూళ్ల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

# పాడిరైతు శ్రేయస్సు కోసమే పాటుపడ్డా!

**- కొండ్రెడ్డి రంగారెడ్డి**



పాడిరైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చడానికి తాను శక్తికి మించి కష్టపడ్డానని విజయడెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి చెప్పారు. 7వ తేదీ నెల్లూరులోని విజయ డెయిరీలో పాలకవర్గ సమావేశం జరిగింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డెయిరీ ఛైర్మెన్‌గా నాలుగేళ్ల పదవీ కాలంలో ఎంతో సంతృప్తిగా పనిచేసానన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామసొసైటీలకు ధరవ్యత్యాసాన్ని చెల్లించాం. ఈ సంవత్సరం సొసైటీలు సరఫరా చేసిన ప్రతి లీటరు పాలకు 25పైసల వంతున చెల్లించాలనుకున్నాం. దీని కోసం 14లక్షలు చెల్లించే విధంగా పాలకవర్గంలో తీర్మానించాం. నేను ఛైర్మెన్ అయ్యాక రైతులకు మేలు చేయాలనే ముందుచూపుతో డెయిరీకి వచ్చే డబ్బులు ప్రతినెలా కొంత ఎత్తిపెట్టి కోటిరూపాయలకు పైగా షేర్‌క్యాపిటల్‌ను దాచడం జరిగింది. దీనిపై వచ్చే వడ్డీని సహకార సొసైటీలలో జమ చేస్తున్నాం. ప్రైవేట్ డెయిరీలకంటే కూడా విజయడెయిరీ పాడిరైతులకు లీటర్‌కు 1.50రూపాయలు ఎక్కువగా చెల్లిస్తుందని ఆయన చెప్పారు. డెయిరీలో పనిచేస్తున్న సీనియర్ ఉద్యోగులకు దసరా కానుకగా పిఆర్‌సిని అమలు చేయనున్నట్లు వెల్లడించారు.



# చిన్మయా విద్యాలయలో స్వచ్ఛభారత్

తడలోని శ్రీ సిటీ చిన్మయా విద్యాలయలో మంగళవారం జరిగిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో విద్యార్థులు చెట్లు నాటి పరిసరాలు శుభ్రం చేశారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా 'క్లీన్ అండ్ గ్రీన్' స్పెషల్ డ్రైవ్‌ను ప్రతి నెలా శ్రీసిటీలో నిర్వహిస్తున్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో సెజ్ డెవలప్‌మెంట్ కమిషనర్ అనిల్ కె చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పిల్లలకు వాతావరణం, పచ్చదనం - పరిశుభ్రతపై అవగాహన కలుగుతుందన్నారు. శ్రీసిటీ ఎండి రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో శుభ్రత అనేది వ్యక్తిగతంగా, సామాజికపరంగా చాలా అవసరమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లలకు అవగాహన కలిగించడం మంచి ఫలితాల నిస్తుందన్నారు. అనంతరం స్వచ్ఛభారత్ అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చివరగా సెజ్ డీసీ సమక్షంలో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేశారు. శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో సెజ్ అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్ పివిఎస్‌బి శాస్త్రి, చిన్మయా విద్యాలయ ప్రిన్సిపాల్ రచన, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రాంట్లు నిలిపితే అభివృద్ధి ఎలా?

**- గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ఎమ్మెల్యే లకు గ్రాంట్లు నిలిపేయడం దుర్మార్గపు చర్య అని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ నెల 8వ తేదీన ఆయన నెల్లూరు రూరల్ పరిధిలోని కొండ్లపూడి, ములు మూడి, సౌత్‌మోపూరు, ఎల్లంటి, కంద మూరు గ్రామాలలో పర్యటించి జడ్పీ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్ర మాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఎంపీలు, ఎమ్మెల్యేలకు గ్రాంట్లు ఇస్తున్నారని, రాష్ట్ర విభజన జరక్కముందు మన రాష్ట్రంలోనూ గ్రాంట్‌లు విడుదల చేశారని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాకే ఈ దుర్మార్గపు సంస్కృతికి శ్రీకారం చుట్టారన్నారు. తాము నిత్యం ప్రజల్లో తిరుగుతుంటామని, తమ దృష్టికి ఎన్నో సమస్యలు వస్తుంటాయని, ఎమ్మెల్యే గ్రాంటు నిలిపి వేయడంతో ఈ సమస్యలన్నింటిని పరిష్కరించలేకపోతు న్నామని ఆయన బాధపడ్డారు. ఎమ్మెల్యే



లకు గ్రాంటులు ఉన్నట్లయితే అభివృద్ధికి ఆస్కారముంటుందన్నారు. ఎన్నికలు అయిపోయాయని, రాజకీయాలు ముఖ్యం కాదని, సమాజాభివృద్ధే ప్రధానమని, కాబట్టి రాజకీయాలను పక్కనపెట్టి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో ఆలో చించి ఎమ్మెల్యేలకు గ్రాంటులు విడుదల చేయాలని డిమాండ్ చేసారు. స్థానిక సంస్థ లను బలోపేతం చేసేందుకు పంచాయి తీలకు ప్రత్యేకనిధిని కేటాయించాలని ఆయన కోరారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# గూడూరు డివిజన్ వార్తలు

## కృష్ణాష్టమి వేడుకలు



సబ్‌జైలులో పండ్లు పంపిణీ చేస్తున్న శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యాంయాదవ్

గూడూరులోని డిఆర్‌డబ్ల్యు కళాశాలలో ఆదివారం రాత్రి శ్రీకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన నలుగురు విద్యార్థులకు పదో తరగతిలో ప్రతిభ కనబరుస్తున్న ఐదుగురు విద్యార్థులకు రూ.500 వంతున నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకొన్నాయి. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి, నెల్లూరు నగర కార్పొరేటర్ నూనె మల్లిఖార్జున్, రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ కమిటీ కార్యదర్శి ఉడతా వెంకట్రావ్, తెలంగాణ ఆర్టీసీ ఆర్ఎం కొమరయ్య, శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షులు మయూరి శ్యాంయాదవ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, గూడూరులోని గడియారపు స్థంభం వద్ద శ్రీకృష్ణ సేవాసమితి, స్థానిక యాదవ సోదరుల ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన స్మైల్ దంత వైద్యశాల సహకారంతో ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. మయూరి శ్యాంయాదవ్ రోగులకు మందులు, పండ్లు పంపిణీ చేశారు. సబ్‌జైలులో కూడా ఖైదీలకు పండ్లు పంపిణీ చేశారు.

## ఉపాధ్యాయులకు లయన్స్‌క్లబ్ సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్

ఉపాధ్యాయులకు సమాజంలో విశిష్ట స్థానం ఉందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు ఎంపిడివో కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులని, ప్రతి ఒక్కరికీ విద్యాబోధన చేసి అన్ని రంగాల్లో ప్రముఖులను తీర్చిదిద్దేది వారేనని తెలిపారు. విద్యార్థులకు గుణాత్మకవిద్యతో పాటు నైతిక విలువలను బోధించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. పట్టణంలోని మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిన పిఎం సులేఖ, మమత, వెంకటేశ్వర్లు, రమణమ్మ, యశోదమ్మలను ఎమ్మెల్యే, క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు తోట సురేష్‌నాయుడు, మల్లు విజయకుమార్‌రెడ్డి, షేక్ రియాజ్ అహ్మద్, కడివేటి చంద్రశేఖర్, నవీన్ జయకుమార్, డాక్టర్ చంద్రహాస్, ఎం.మురళీరెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 5వ తేదీన గూడూరులో జరిగిన గురుపూజోత్సవంలో జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు మరియు ఎంఇఓ దిలీప్‌కుమార్‌ను సన్మానిస్తున్న సబ్‌కలెక్టర్ గిరీషా తదితరులు


## దేశాభివృద్ధిలో గురువులది కీలకపాత్ర



దశరథరామిరెడ్డిని సన్మానిస్తున్న సబ్‌కలెక్టర్ గిరీషా

దేశాభివృద్ధిలో గురువుల పాత్ర కీలకమైనదని సబ్‌కలెక్టర్ గిరీషా పేర్కొన్నారు. కోట మండలం విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బరామరెడ్డి కల్యాణ మండపంలో 5వ తేదీ ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యాన గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు దశరథరామిరెడ్డి, కమలాకర్‌ను సబ్‌కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఎన్.రాంకుమార్‌రెడ్డి, ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమోహన్, ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సబ్‌కలెక్టర్‌ను కలిసిన జ్యోత్స్నలత



సబ్‌కలెక్టర్‌ను కలిసి వినతులు సమర్పిస్తున్న రాధాజ్యోత్స్నలత

గూడూరు నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి రాధాజ్యోత్స్నలత కార్యకర్తల నుంచి భూసమస్యలపై వినతులు స్వీకరించి సోమవారం నాడు గ్రీవెన్స్‌డేలో సబ్‌కలెక్టర్‌ను కలిసి అందజేశారు.

కడివేడులో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ఏడు ఎకరాల భూమిని అడగగా సబ్‌కలెక్టర్ కేటాయించారని ఆమె అన్నారు. అదేవిధంగా పట్టణంలో మరోసబ్‌స్టేషన్‌కు భూమిని కేటాయించమని ఆయన్ను కోరామన్నారు. చిట్టమూరు మండలం అద్దెపూడి హరిజనవాడలో 50 కుటుంబాలు నివాసముంటున్నారని, వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని అడిగానన్నారు. ఇంకా పలు సమస్యలపై సబ్‌కలెక్టర్‌ను కలిసినట్లు తెలిపారు.

## సిఆర్ మార్టులో ఉపాధ్యాయ దినోత్సవం




ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు పొనకా సునంద, ప్రక్కన డాక్టర్ సి.రోహిణి

గూడూరులోని సిఆర్ మార్ట్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని 5వ తేదీన ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న క్లబ్ అధ్యక్షురాలు పొనకా సునంద మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనదన్నారు. అనంతరం ఉపాధ్యాయులు లక్ష్మిప్రియ, ఉషారాణి, హేమ కుమారిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి స్నేహలతరెడ్డి, డాక్టర్ సి.రోహిణి, ఆంధ్ర మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ మోదకొండ

## ఆక్రమణల తొలగింపు

గూడూరు విఘ్నేశ్వరపురంలో ఆక్రమణలను సోమవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ మోదకొండ సిబ్బందితో తొలగించారు. సంగం థియేటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు సిసిరోడ్డు నిర్మాణంలో భాగంగా గతంలో ఆక్రమణలు తొలగించినా చికెన్ దుకాణదారులు మరోసారి ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తున్నారు. ఇదే విషయాన్ని సబ్‌కలెక్టర్ గిరీషా కమిషనర్‌తో ప్రస్తావించి ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. ఆదేశాల మేరకు రోడ్డు ఆక్రమణలను తొలగించినట్లు ఆయన 'లాయర్'కు తెలిపారు.

## ఐటిఐ ప్రభుత్వ కళాశాలలో నీటి శుద్ధి యంత్రం



గూడూరులోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో కనుమూరు హరిశ్చంద్రారెడ్డి ఛారిటబుల్‌ట్రస్టు తరపున అందించిన నీటి శుద్ధి యంత్రాన్ని ఇటీవల డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో దాతలకు కొదవలేదని, వారు అందించే వస్తువులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రజిత, నెల్లూరు కళాశాల ప్రిన్సిపాల్ ఏడుకొండలు, ట్రస్టు ఛైర్మెన్ కె.మునిగిరీష్, సభ్యులు వరప్రసాద్, అనిల్, దయాకర్‌రెడ్డి, టౌన్ సిఐ సుబ్బారావు, ఎస్ఐలు బాబి, పి.నరేష్ పాల్గొన్నారు.

## బీమా సంస్థల్లో నమ్మకమైనది ఎల్ఐసి



మునిగిరీష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్

బీమా సంస్థల్లో ఎంతో నమ్మకమైనది ఎల్ఐసి అని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరులోని ఆ సంస్థ కార్యాలయంలో సోమవారం బీమా వారోత్సవాల ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరు బీమా చేసుకోవాలని, ఇది కుటుంబానికి ఎంతో అవసరమన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు, ప్రతిభ కనపరచిన ఏజెంట్లకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రవిచంద్రన్, అసిస్టెంట్ బ్రాంచ్‌మేనేజర్ రాజశేఖర్, యూనియన్ నాయకులు గోపి, ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు కె.మునిగిరీష్, ఏజెంట్లు పాల్గొన్నారు.



ఈ నెల 5వ తేదీన నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన గురుపూజోత్సవంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును జిల్లా కలెక్టర్ యం.జానకి చేతుల మీదుగా అందుకుంటున్న గూడూరు మండలం చవటపాలెం స్కూల్ ఉపాధ్యాయులు ఎం.పురందర్‌రాజు

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగ ప్రయత్నాలలో వున్నవారికి అనుకూలత బాగున్నది. ఉద్యోగులకు పనిభారం, స్థానమార్పులుంటాయి. ఖర్చులు, చెల్లింపులు ఎక్కువగా వుంటాయి. ఆర్థిక వ్యవహారాలలో జాగ్రత్తగా ఉండండి. వృత్తి వ్యాపారాలవృద్ధి, ఆదాయం సంతృప్తికరం. అనుకున్న పనులు నిదానంగా జరుగుతూ విసుగు కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. రాబడి సంతృప్తికరంగా ఉండదు. ఉద్యోగులకు స్థానమార్పులు, అధికార వర్గం వల్ల ఇబ్బందులుండగలవు. ఆర్థిక ఇబ్బందులుంటాయి. ఖర్చులు పెరుగుతాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. ఋణాల వత్తిడి పెరుగుతుంది. బంధువులతోను, మిత్రులతోను భేదాభిప్రాయాలు ఏర్పడవచ్చును.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వ్యాపారవర్గాల వారికి అభివృద్ధి రాబడి బాగుంటుంది. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. ఆలోచనలు నిలకడగా ఉండక, అనుకున్న పనులను హడావిడిగా చేయవలసి వస్తుంది. ముఖ్య వ్యవహారాలలో పెద్దల సలహాలు తీసుకొనడం మంచిది. పెట్టుబడులకు అవకాశాలు, శుభకార్య నిర్ణయాలు జరుగగలవు. ఉద్యోగులకు పని భారం ఎక్కువగా వుంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్శ1, 2పాదాలు

ముఖ్యమైన విషయాలు స్వయంగా పర్యవేక్షిస్తే లాభాలుంటాయి. షేర్లు పెట్టుబడులందు అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగార్థులు దొరికిన అవకాశం వినియోగించుకొనాలి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయము పెరుగుతుంది. అయితే ఆడంబరాలకు మొగమాటాల కారణంగా ఖర్చులు పెరుగుతాయి. సభలు సమావేశాలలో మీకు ప్రాముఖ్యత ఉంటుంది.



### బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 11.09.2015 నుండి

తేది. 17.09.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, కర్కాటకంలో కుజశుక్రులు, 15తేది నుండి సింహంలో కుజుడు, సింహంలో రవి గురువులు, కన్యలో బుధ రాహువులు, వృశ్చిక శని, సింహ కన్య తులా రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 17 గురువారము శ్రీ వినాయక చతుర్థి

కన్యాభాద్రపదము శూన్యమాసారంభము.

### శ్రావణ మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 11 | శుక్ర | త్రయోదశి | ఉ॥ గం.7.33ని॥ |
| తేది. 12 | శని | చతుర్దశి | ఉ॥ గం.8.56ని॥ |
| తేది. 13 | ఆది | అమావాస్య | ఉ॥ గం.10.37ని॥ |

### భాద్రపద మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 14 | సోమ | పాడ్యమి | ప॥ గం.12.43ని॥ |
| తేది. 15 | మంగళ | విదియ | ప॥ గం.2.47ని॥ |
| తేది. 16 | బుధ | తదియ | సా॥ గం.4.45ని॥ |
| తేది. 17 | గురు | చతుర్థి | సా॥ గం.6.30ని॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబ వ్యక్తులకు అనారోగ్య బాధలుంటాయి. స్థిరాస్తుల లావాదేవీలను వాయిదా వేసికొనండి. రావలసిన బాకీలు లభించవు. పెద్దమొత్తాలలో పెట్టుబడులు ప్రస్తుతానికి వద్దు. మీ నుండి సమాచారాలు సేకరించి మిమ్మల్ని ఇబ్బంది పెట్టే వారుంటారు కాబట్టి జాగ్రత్త అవసరం. వాహనాలు నడిపేవారు, యంత్రాలతో, కరెంటుతో పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండాలి.

## మిథునం



మృగశిర్శ 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అదనపు ఖర్చులను భరించక తప్పదు. స్థిరాస్తుల క్రయ విక్రయాలకు అనుకూల సమయము. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. కొత్త వ్యాపార ఆలోచనలు, పెట్టుబడి అవకాశాలకు రూపమివ్వండి. వృత్తి వ్యాపారాలలో ఆర్థికంగా బలపడతారు. ఆదాయం పెరుగుతుంది. విద్యార్థులకు మంచి ప్రగతి ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. నూతనవస్తు లాభం ఉంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

బంధువర్గాల వల్ల సమస్యలు కలిగే అవకాశం ఉన్నది. కోర్టు వ్యవహారాలలో అనుకూలత తక్కువ. కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. తొందరపాటు నిర్ణయాలు తీసుకొని ఇబ్బందిపడే పరిస్థితులున్నాయి. వ్యాపారవర్గాలకు అభివృద్ధి అవకాశాలు చేజారిపోవచ్చును. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. కుటుంబసౌఖ్యం కలదు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

పెట్టుబడులకు అనుకూల అవకాశాలుంటాయి. ఉద్యోగులకు అధికారుల అనుకూలత స్థానమార్పులుంటాయి. పెండింగ్ సమస్యలు పరిష్కారానికి వస్తాయి. మంచివాళ్ళతో పరిచయాలుంటాయి. ఇంట బయట మీ సామర్థ్యంతో ఎదుటి వారిని ఆకర్షించగల శక్తి ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధికై శ్రమపడి ఆదాయం పెంచుతారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

పెద్ద మొత్తాలలో ఆర్థిక పెట్టుబడులు ప్రస్తుతం చేయవద్దు. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడతాయి. స్త్రీలకు అనారోగ్య బాధలుంటాయి. వృత్తి వ్యాపారాలలో మంచి ఆర్థికావకాశాలు లభించి ఆదాయం పెరుగుతుంది. అయినా అనుకోని అవసరాలు ఏర్పడి ఋణం చేయవలసి వస్తుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగులకు అధికారుల సహకారం స్థానమార్పులుంటాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు ఉండకపోవచ్చును.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అనుకున్న పనులను హడావుడిగా చేయవలసి వస్తుంది. దూర ప్రయాణాలుంటాయి. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడతాయి. వృత్తి వ్యాపారాలలోను, నిర్మాణాలకు గాని, కొత్త ఋణాలకు ప్రయత్నాలు జరుగుతాయి. గృహ వస్తువాహన రిపేర్ల ఖర్చులుంటాయి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. శుభకార్య ప్రయత్నాలు వెనుకబడగలవు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి వ్యాపారాలలో ఆదాయము సంతృప్తికరంగా ఉంటుంది. ఎదుటివారి విమర్శలకు ధీటుగా సమాధానమిస్తారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. ఇంట బయట అనుకూల పరిస్థితులేర్పడి అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. ఆర్థికముగా కొత్త ప్రణాళికలు, ప్రయత్నాలలో ముందుకు సాగుతారు. శుభకార్య ప్రయత్నాలు అనుకూలించగలవు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ప్రభుత్వ అనుమతులు లభించగలవు. బంధుముఖ్యులకు అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. చేపట్టిన, చేయదలచిన పనులకు పరిస్థితులు అనుకూలించగలవు. శాస్త్ర సాంకేతిక వైద్యరంగాల వారికి మంచి అభివృద్ధి, ఆర్థికావకాశాలుంటాయి. వ్యాపార వర్గాలకు సామాన్య ఆదాయం. ఉద్యోగులకు స్థానమార్పులు, పనిభారం ఉంటుంది.

# ఉల్లిపాయలపై వ్యాట్

శ్రీను గల్పిక

అది ఢిల్లీలోని టెన్‌జనపథ్. వివిధ జాతీయ, అంతర్జాతీయ ఛానెళ్ల రిపోర్టర్లు, పత్రికల ప్రతినిధులు వచ్చి వున్నారు. అక్కడే హాల్‌లో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి ఉన్నారు. కాంగ్రెస్ యువరాజు రాహుల్ గాంధీ మధ్యలో కూర్చోగా, ఆయనకు అటు ఇటు మన్మోహన్‌సింగ్, ఎ.కె. ఆంటోని, మనీష్‌తివారి, గులాంనబీ ఆజాద్, మల్లిఖార్జునఖర్గే, అహ్మద్‌పటేల్‌లు కూర్చుని వున్నారు. రాహుల్‌గాంధీ అటు ఇటు చూసి... దిగ్విజయ్‌సింగ్‌జీ ఎక్కడ... అని అడిగాడు. హనీమూన్‌కు వెళ్లాడ్సార్ అని ఆంటోనీ అన్నాడు. ఆ ఊరెక్కడుంది అని రాహుల్ తిరిగి ప్రశ్నించాడు. దానికి ఆంటోనీ... హనీమూన్ అంటే ఊరు కాదు సార్, కొత్తగా పెళ్లయిన జంట సరదాగా ఏ పర్యాటక ప్రాంతానికైనా వెళ్లడాన్ని హనీమూన్ అంటారు. మీకు ఈ విషయం తెలియకపోవడంలో తప్పేమీ లేదు. పాపం... మీకింకా ఆ అవకాశం రాలేదుగా అని అన్నాడు. అయినా మనవడు పెళ్లి చేసుకుని హనీమూన్‌కు పోతే ఈయన తోడు పోవడమెందుకని రాహుల్ ఆశ్చర్యంగా ఫేస్‌పెట్టి అడిగాడు. అయ్యో... నా పిచ్చి రాహుల్! పెళ్లి చేసుకుని హనీమూన్‌కు పోయింది దిగ్విజయ్‌జీ మనుమడు కాదు, దిగ్విజయ్‌సింగే అని ఆంటోనీ చెప్పాడు. ఆ మాటకు రాహుల్ నోరెళ్లబెట్టి... ఈ వయసులో పెళ్లేంటి అని ప్రశ్నించాడు. అప్పుడు అహ్మద్‌పటేల్ కలుగజేసుకుని... అందరూ మీలాగే పెళ్లి చేసుకోకుండా తెలివిగా ఉండలేరుగా... దిగ్విజయ్ వట్టి అమాయకుడు. ఈ వయసులో మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. అతని అమాయకత్వం మీద బండ పడ... అని అన్నాడు. ఆ టాపిక్‌ను పక్కన పెట్టి రాహుల్ ప్రెస్‌మీట్‌లో మాట్లాడడానికి సిద్ధమయ్యాడు.

రాహుల్ కళ్లు తుడుచుకుంటూ... దేశంలో పరిస్థితులు చాలా దారుణంగా వున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీకి మాటలెక్కువ, పని తక్కువ. ఈ కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైంది. ముఖ్యంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలే కాదు ధనికవర్గాల వారు కూడా ఈరోజు ఉల్లిపాయలను కొనలేకపోతున్నారు. ఎవరింట్లోనూ, ఎవరి కూరల్లోనూ ఈరోజు ఉల్లిపాయలు లేవు. నేను మొన్న ఓ హోటల్‌కెళ్లి అలవాటులో పొరపాటుగా ఉల్లిదోశె ఆర్డర్ చేసాను. సర్వర్ నావైపు అదోలా చూసి... ఏం సార్, డబ్బు అంత ఎక్కువగా ఉందా? అని అడిగాడు. దేశంలో ప్రజలు ఉల్లిపాయను కోహినూర్ వజ్రంలాగా చూస్తుంటే మన ప్రధాని మాత్రం ప్రతికూరలోనూ ఉల్లిపాయలు తింటున్నాడంట... ఇంతకంటే అన్యాయముంటుందా? ఇంతకంటే ద్రోహముంటుందా? నరేంద్ర మోడీకి ఏ మాత్రం నైతిక విలువలున్నా వెంటనే ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంతలో వి.హెచ్.హనుమంతరావు ట్రేలో కాఫీ కప్పులు పెట్టుకుని అక్కడకు వచ్చి అందరికీ ఇవ్వసాగాడు. రాహుల్‌గాంధీ ఓ కాఫీకప్పు అందుకోబోతుండగా వి.హెచ్ అడ్డుపడి... బాబూ, మీ కోసం లోపల అమ్మగారు వేడివేడిగా ఉల్లిపకోడీ, ఉల్లిదోశెలు చేస్తున్నారు, మీరెళ్లి అవి తినిరండి అని పెద్దగా అన్నాడు. ఆ మాటతో రాహుల్ చేతిలో వున్న మైక్‌తో తల కొట్టుకోసాగాడు.

★★★★★

అది నాగ్‌పూర్‌లోని ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయం. ఆరెస్సెస్ పెద్దలు వినయ్ కతియార్, ప్రవీణ్ తొగాడియా... ఇంకా కొందరు అధిపతులు అక్కడున్నారు. అప్పుడే అక్కడకు నరేంద్ర మోడీ, అరుణ్ జైట్లీ, వెంకయ్యనాయుడు, రాజ్‌నాథ్‌సింగ్, స్మృతిఇరానీ, అనంతకుమార్‌లు వచ్చారు. అందరిలోనూ తెలియని భయం ఉంది. ఆరెస్సెస్ అధిపతులు తమ ప్రభుత్వపాలన పట్ల ఎలా రియాక్ట్ అవుతారోనని వీరి భయం. అలా భయపడుతూనే వెళ్లి వారి ముందు కూర్చున్నారు. ప్రవీణ్ తొగాడియా సీరియస్‌గా... ఏం మోడీజీ... ఏంటి పరిపాలన ఇలా వుంది అని అడిగాడు. మోడీ స్పందిస్తూ... నేను రేయింబవళ్లు కష్టపడుతూనే వున్నాను. అయినా అన్నీ దారికి రావడం లేదు. మీరు అడిగేది ఆ పాకిస్థాన్ గురించే కదా... వాళ్లు మన సరిహద్దులపై కాల్పులు జరుపుతున్నారు. మనవాళ్లు కూడా ధీటుగానే స్పందిస్తున్నారు అని చెప్పాడు. నాకది ముఖ్యం కాదు అని ప్రవీణ్ తొగాడియా అంటుండగానే మోడీ అందుకుని... ఓహో ఆర్థిక సంక్షోభం గురించా... ఏం భయం లేదు. మన సంస్కరణలు సక్సెస్ అవుతాయి. త్వరలోనే మన దేశం ప్రపంచ ఆర్థిక శక్తిగా అవతరిస్తుందని చెప్పాడు. ప్రవీణ్ తొగాడియా దానికి కూడా సంతృప్తి చెందకుండా... అది కూడా సమస్య కాదన్నాడు. వెంటనే మోడీ... ఇక నేనేం చేసేది చెప్పండి, పెట్టుబడుల కోసం ప్రపంచంలో ఉన్న అన్ని దేశాలు తిరుగుతున్నాను, మీరు వ్యతిరేకిస్తున్నారని చెప్పి భూసేకరణ ఆర్డినెన్స్‌ను కూడా పక్కన పెట్టానన్నాడు. ప్రవీణ్ తొగాడియా వుండి... వీటితో నీ ప్రభుత్వానికొచ్చిన ఇబ్బందేమీ లేదు. ఈ సమస్యలు అలా వుంటేనే మీకూ పని ఉన్నట్లుంటుంది. మీ ప్రభుత్వానికి అసలు డేంజర్ ఉల్లిపాయలతోనే. ముందు వాటి రేట్లను కంట్రోల్ చేయండి. స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటు చేసైనా బ్లాక్ మార్కెట్లో దాచిన ఉల్లిపాయలను బయటకు తెప్పించండి. ఉల్లిపాయలు మహిళలతో ముడిపడిన విషయం. వారికి మండిందంటే మన ప్రభుత్వం ఢమాలే అని హెచ్చరించి లేచాడు.

★★★★★

హైటెక్ రత్న చంద్రబాబు హైదరాబాద్‌లోని సచివాలయంలో క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేశాడు. మంత్రులంతా వచ్చారు. చంద్రబాబు మాట్లాడుతూ ఉల్లిపాయల రూపంలో మనం ప్రభుత్వాదాయాన్ని పెంచుకునే అవకాశం వచ్చింది. ఉల్లిపాయల మీద వ్యాట్ టాక్స్ విధిస్తున్నాం. బయట మార్కెట్లో పాన్‌కార్డు, ఆధార్‌కార్డు వివరాలు తీసుకుని ఉల్లిపాయలు అమ్మాలని ఆదేశించాం. ఇళ్లల్లో, స్విస్‌బ్యాంకుల్లో బ్లాక్‌మనీ మూలుగుతున్న వాళ్లే ఈ సమయంలో ఉల్లిపాయలను కొనగలరు. అలాంటి వాళ్లంతా ఇప్పుడు బయటకొస్తారు. బయట మార్కెట్లో ఉల్లిపాయలు కొన్న ప్రతి ఒక్కరి ఇళ్ల మీద ఏసిబి, ఇన్‌కంటాక్స్ దాడులు చేయిద్దాం. బ్లాక్‌మనీ వస్తుంది. ఇలా పోగైన డబ్బును రాబోయే కృష్ణ పుష్కరాలకు ఖర్చు పెడదామని చెప్పాడు. చంద్రబాబు తెలివికి అబ్బురపడ్డ మంత్రులంతా చప్పట్లు కొట్టి అభినందించారు.

★★★★★

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరం. ట్రంకురోడ్డులో మురళీకృష్ణ హోటల్. స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి(64+) అప్పుడే అక్కడ కారు దిగాడు. నేరుగా హోటల్‌లోకి వెళ్లి... ఒక ఉల్లిపెసరట్టు అంటూ ఆర్డర్ చెప్పాడు. ఉల్లి పెసరట్టు పేరు చెప్పగానే... అక్కడ టిఫిన్ తింటున్న వాళ్లంతా వివేకా వైపు ఆశ్చర్యంగా చూసారు. కొందరైతే మనసులో ఎంత డబ్బున్న బలుపు కాకపోతే ఈ కాలంలో కూడా ఆనియన్ పెసరట్టు తింటారా... అని అనుకున్నారు. సర్వర్ పెసరట్టు తెచ్చాడు. వివేకా తిన్నాడు. సర్వర్ బిల్లు తెచ్చాడు. వివేకా కళ్లకున్న నల్లద్దాలు తీసి చూసాడు. ఆశ్చర్యంగా ముఖంపెట్టి... బాబూ, నా ఒక్కడి బిల్లు తెచ్చివ్వు... నువ్వు ఇక్కడ తింటున్న అందరి బిల్లు కలిపి నాకే ఇచ్చినట్లున్నావన్నాడు. అందుకు సర్వర్... అది మీ ఒక్కరి బిల్లే సార్, మీరు తిన్నది మామూలు దోశె కాదు... ఆనియన్ పెసరట్టన్నాడు. ఇంత డబ్బు నా దగ్గరలేదని వివేకా అన్నాడు. అయితే ఆ కారు అక్కడ పెట్టి పోండని సర్వర్ చెప్పాడు. ఆ కారు నాది కాదు, నా ఒంటి మీద చొక్కా కూడా నాది కాదు. నా వద్ద ఉన్న వాటిలో కళ్లద్దాలు, కర్చీఫ్, కట్‌డ్రాయరే నా సొంతం... గత పాతికేళ్లుగా వాటిని వాడుతున్నాను... కావాలంటే వాటిని ఉంచుకోమన్నాడు. సర్వర్ కళ్లు తేలేసి... ఆ స్థిరాస్తులు మీ వద్దే ఉంచుకోండి సార్... మీకో దండం... మీ బిల్లుకోదండం అంటూ రెండుచేతులు జోడించాడు.

# అధికారపక్షంలోనే ప్రతిపక్షం

- మున్సిపల్ సమావేశంలో హైడ్రామా
- అయోమయంలో ఇన్‌ఛార్జి ఛైర్మెన్
- వివాద స్థల అంశంపై ఓటింగ్ కోరిన టిడిపి కౌన్సిలర్లు



కావలి మున్సిపల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మంగళవారం పెద్ద 'హైడ్రామా' నడిచింది. కావలి పురపాలక సంఘ సమావేశ మందిరంలో అత్యవసర, సాధారణ సమావేశాలు జరిగాయి. మున్సిపల్ అధికారుల లెక్కప్రకారం ఉదయం 11గంటలకు ప్రారంభం కావలసింది... 11.45 గంటలకు 9మంది టిడిపి కౌన్సిలర్లతో ఇన్‌ఛార్జి ఛైర్మెన్ గుండ్లపల్లి భరత్‌కుమార్ ఛైర్మెన్ కుర్చీలో ఆసీనులయ్యారు. మిగిలిన కౌన్సిలర్లు రాకపోవడంతో మరో 40నిమిషాల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముందుగా అత్యవసర సమావేశంలోని మూడు కమిటీలను సానుకూలంగా ఆమోదించారు. అనంతరం సాధారణ సమావేశం ప్రారంభంలోనే అజెండాలోని మొదటి అంశం తటవర్తి మల్లిఖార్జునరావు మరో 14మందికి సంబంధించిన పుల్లారెడ్డినగర్ లోని కావలి బిట్-2, సర్వే నెం.1925/2 మరియు 1925/3లలోని స్థలాన్ని పబ్లిక్ యుటిలిటీ నుండి నివాస ప్రాంతంగా మార్చేందుకు కౌన్సిల్ ఆమోదం కొరకు అంశాన్ని పొందుపరిచారు. ఇదే అంశాన్ని ఇప్పటికే 3సార్లు వాయిదా వేశారు. అయినా నాలుగవసారి ఇరు పార్టీల మధ్య నేతలతో రహస్య మంతనాలు జరిపి అజెండాలో చేర్చారు. ఈ అంశాన్ని చదువుతున్నప్పుడే అధికారపార్టీకి చెందిన ఇద్దరు టిడిపి కౌన్సిలర్లు వడ్లమూడి వెంకటేశ్వర్లు, వెంకటస్వామిలు లేచివిలువైన ఈ స్థలాన్ని మున్సిపాలిటీ తీసుకుంటే రాబోవు తరాలకు కూడా బాగుంటుందని, న్యాయనిపుణుల సలహా కూడా అదేనని వివరించారు. మిగిలిన టిడిపి కౌన్సిలర్లు మాత్రం ఈ అంశాన్ని ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. అందుకు నిరాకరించిన వడ్లమూడి, వెంకటస్వామిలు అడ్డు తగులుతూ తీవ్రస్వరంతో దమ్ముంటే ఓటింగ్ పెట్టి ఆమోదించాలని పోడియం వద్దకు వెళ్లి భరత్ కుమార్‌ను నిలదీశారు. ఇంతలో కమిషనర్ అన్నవరపు వెంకటేశ్వర్లు కలుగజేసుకుని మూజువాణి ఓటింగ్‌తో ఆమోదించుకోవచ్చునని ఇన్‌ఛార్జి ఛైర్మెన్‌కు సూచించారు. ఇంత జరుగుతున్నా వైకాపా కౌన్సిలర్లు ఒక్క మాల్యాద్రి మినహా ఏ ఒక్కరూ నోరు మెదక పోవడంపై టిడిపి, వైసిపిలు ఒక ఒప్పందానికి వచ్చినట్లుందని పలువురు చర్చించుకుంటున్నారు.

ఈ గందరగోళాల నడుమ సమావేశం 5 నిమిషాలు వాయిదా వేస్తున్నట్లు భరత్‌కుమార్ తెలిపారు. తిరిగి సమావేశం ప్రారంభం కాగానే మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కనుమర్లపూడి వెంకట నారాయణను ఈ విషయమై అభిప్రాయం చెప్పమనడంతో కనుమర్లపూడి ముందు మీ ఇంటి పోరు తేల్చుకోమని అనంతరం మా అభిప్రాయం చెబుతామన్నారు. అధికారపక్షంలో వ్యతిరేకత వచ్చినప్పుడు దాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన వైకాపా కౌన్సిలర్లు మౌనం వహించడంతో రెండు పార్టీలు హైడ్రామా నడుమ అంశాన్ని ఆమోదించాయి. ఈ పరిణామంతో వడ్లమూడి, వెంకటస్వామిలు ఆవేశంతో కొద్దిసేపు ఊగిపోయారు. అధికారపక్షంలో మేమూ సభ్యులమేనని మా ప్రమేయం లేకుండా ఈ అంశాన్ని ఆమోదిస్తే ఇంకా 4సంవత్సరాల పాటూ సమావేశాలు నిర్వహించాలని, అది ఎలా నిర్వహిస్తారో చూస్తామన్నారు. ఒక సమయంలో నిరాహారదీక్షకు కూర్చునేందుకు సిద్ధమయ్యారు. మేము వ్యతిరేకిస్తుంటే మీరు ఆమోదించడానికి గల కారణమేమిటని భరత్‌కుమార్‌ను నిలదీశారు.

# పేదలకు వైద్యమే పరమానందం

**- డా॥ ఎన్.ప్రభాకర్‌నాయుడు**

పేదప్రజల సేవకే నా జీవితం అంకితం అని పి.ఎ.బి.సి సంస్థల నిర్వాహకులు జి.డి.ఓ దివాకర్ అన్నారు. ఆదివారం స్థానిక సందిఏడగల దేవదానం మెమోరియల్ వైద్యశాలలో ప్రభాకర్‌నాయుడు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. లక్ష్మి గంగాభవాని 5వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో 4000మంది రోగులకు ఇ.సి.జి రక్తపరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దివాకర్ మాట్లాడుతూ డా॥ ప్రభాకర్‌నాయుడు వైద్యంతో ఎందరికో పునర్జన్మ ఇచ్చారన్నారు. అందువలనే ఈ సంస్థ భవనాలలో వైద్యశాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయనకు సంస్థ సహాయసహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో పనిచేసి లక్ష ఆపరేషన్‌లు చేసి రికార్డు సృష్టించారన్నారు. తక్కువ ఖర్చుతో వైద్యం అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. డా॥ ప్రభాకర్‌నాయుడు మాట్లాడుతూ ప్రతి మనిషి జన్మించడం,



మరణించడం సహజమైన విషయమని, అయితే పేదప్రజలకు ఎంతసేవ చేసామన్నది ముఖ్యమన్నారు. పేదలు ఎన్నో రోగాలతో బాధపడుతున్నారని, డబ్బు ఖర్చుపెట్టి, దూరప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోని పరిస్థితులు వుంటున్నాయని, అందుకోసమే ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంతకన్నా ఆనందం మరొకటి లేదన్నారు. ఈ వైద్యశిబిరంలో ఉచిత సేవలు అందించిన డాక్టర్లకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నై, హైదరాబాద్, నెల్లూరు, ఒంగోలుకు చెందిన డాక్టర్లు పాల్గొన్నారు.






## విద్యార్థులు దేశానికి సేవచేయాలి

కావలి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలను మున్సిపల్ ఇన్‌ఛార్జి ఛైర్మెన్ గుండ్లపల్లి భరత్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దేశానికి సేవచేయాలన్నారు. సైన్సు లేకుండా ప్రపంచం లేదన్నారు. ఈ ప్రదర్శనలు తిలకించేందుకు వేల సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు రావడం విశేషం.



# కావలి కబుర్లు



# రక్తదానం ప్రాణదానంతో సమానం

రక్తదానం ప్రాణదానంతో సమానమని రెడ్‌క్రాస్ రక్తనిధి ఛైర్మెన్ డా॥ లక్ష్మీనరసారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో వాయిస్ ఆఫ్ ముస్లిం మైనార్టీ సంస్థ నిర్వాహకులు మొగల్ సలీంబేగ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డా॥ లక్ష్మీనరసారెడ్డి మాట్లాడుతూ యువకులు రక్తదానంపై అవగాహన కలిగి సంవత్సరకాలంలో నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చన్నారు. దీనికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని, చాలా ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ముస్లిం సోదరులు తరుచూ కులమతాలకు అతీతంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డా॥ రవికుమార్, రెడ్‌క్రాస్ కార్యదర్శి రవిప్రకాష్, తన్నీరు మాల్యాద్రి, దామసెట్టి సుధీర్, డా॥ కృష్ణారావు, గౌరవాధ్యక్షుడు సయ్యద్ కిర్మాని, సభ్యులు జమీర్, ఇంతియాజ్, మొగల్‌రహీంబేగ్, హెచ్‌పి గ్యాస్ నిర్వాహకులు నీరజరెడ్డి, మాజీమున్సిపల్ ఛైర్మెన్ నగళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గురువులను పూజించండి.. జ్ఞానం పొందండి



గురువులను పూజించి జ్ఞానం పొందాలని విద్యార్థులకు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, రాజధాని నిర్మాణ కమిటి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్ రావులు సూచించారు. ఆదివారం స్థానిక ఆర్ఎస్ఆర్ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ పాఠశాల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రార్థనాగీతం అనంతరం సభా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు జ్ఞాన సంపదను విద్యార్థులకు పంచి వారిని దేశానికి ఉపయోగపడే విధంగా తయారుచేయాలన్నారు. డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారని, ఆయన గొప్ప మేధావిగా పేరు తెచ్చుకొన్నారన్నారు. ఆయన రాష్ట్రపతిగా ఎదగడం మనమందరం గర్వించదగ్గ విషయమన్నారు. ఆధునిక యుగంలో పోటీతత్వం పెరిగిపోయిందని, అందుకు తగ్గట్లు విద్యార్థులను తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కావలి నియోజక వర్గంలోని ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే 60మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌ఛార్జ్ ఛైర్మెన్ భరత్‌కుమార్, ఆర్టీఓ మురళీమోహన్, డిఇఓ ఆంజనేయులు, డిప్యూటీ డిఇఓ శివకుమార్, జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు చాట్ల నరసింహారావు, కర్తం ప్రతాప్‌రెడ్డి, కావలిశాఖ అధ్యక్షుడు కాంతారావు, కొండపనాయుడు, వెంకటేశ్వర్‌రెడ్డి, డివి రమణయ్య, మాజీమున్సిపల్ ఛైర్మెన్ నగళ్ళ శ్రీనివాసకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

# పాలిచర్ల చంద్రశేఖర్‌రెడ్డి



మాజీమంత్రి, శాసనమండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మామగారు పాలిచర్ల చంద్రశేఖర్‌రెడ్డి ఈ నెల 9వ తేదీన కన్ను మూసారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సింహపురి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన వయసు 77సంవత్సరాలు. కొడవలూరు మండలం మానేగుంటపాడు స్వగ్రామం. ఈ గ్రామ సింగిల్‌విండో అధ్యక్షుడిగా గతంలో పనిచేసి వున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త పి.వి.ప్రసన్నరెడ్డికి వరుసకు చిన్నాన అవుతాడు. చంద్రశేఖర్‌రెడ్డికి నలుగురు కుమార్తెలు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సతీమణి శ్రీమతి జ్యోతి ఆయన రెండోకూతురు. చాలాకాలంగా చంద్రశేఖర్‌రెడ్డి తన రెండో అల్లుడు సోమిరెడ్డి వద్దేవుంటూ ఆయనకు చేదోడువాదోడుగా వుంటున్నారు. సోమిరెడ్డికి సంబంధించిన చాలా పనులు ఆయనే చూసుకునేవారు. సోమిరెడ్డి కూడా తండ్రి లేకపోవడంతో తన మామనే పెద్దదిక్కుగా భావించేవాడు. చంద్రశేఖర్‌రెడ్డి మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# ఉచిత అంబులెన్స్ ప్రారంభం

గ్లోబల్ హెల్త్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వెంటిలేటర్‌తో కూడిన ఉచిత అంబులెన్స్ వాహనాన్ని నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ ఈ నెల 5న నెల్లూరు సండేమార్కెట్ వద్దనున్న గ్లోబల్ ఆసుపత్రి వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పేదల కోసం ఉచితంగా వెంటిలేటర్ టెక్నీషియన్, అంబులెన్స్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసిన గ్లోబల్ ఆసుపత్రి యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఆసుపత్రి వైస్‌ఛైర్మన్ వి.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ అత్యవసర వైద్యం కోసం ఫోన్‌చేస్తే ఉచితంగా నెల్లూరులో రోగికి నచ్చిన ఆసుపత్రికి తీసుకెళ్తామన్నారు. వివరాలకు 7680931555 నెంబరులో సంప్రదించాలని కోరారు. డాక్టర్ హరికుమార్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆటల పోటీలు

కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్, ఆర్కిటెక్ట్స్, ఎల్‌బిఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ ఇంజనీర్స్‌డే సందర్భాన్ని పురస్కరించుకుని అసోసియేషన్ సభ్యులకు ఈ నెల 5, 6 తేదీలలో నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఆటల పోటీలు నిర్వహించినట్లు జనరల్ సెక్రటరి ఎన్.మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. ఈ పోటీలను నగర మునిసిపల్ కమిషనర్ పివివిఎస్ మూర్తి, బి.ప్రభాకరరెడ్డి ప్రారంభించారు. ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అంజేసినట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షులు పి.ఆసిఫ్‌ఖాన్, కోశాధికారి షేక్ హిదయతుల్లా, సభ్యులు పాల్గొన్నారు.

# బాలకృష్ణతో ఆదిత్య-999

**సినీదర్శకుడు సింగీతం శ్రీనివాసరావు**

గతంలో సినీనటుడు బాలకృష్ణతో ఆదిత్య-369 చిత్రానికి సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించి చిత్ర విజయానికి దోహదపడ్డారు. మరలా యువరత్న నందమూరి బాలకృష్ణతో ఆదిత్య-999 చిత్రాన్ని తీసేందుకు స్క్రిప్ట్ రెడీగా వుందని ప్రముఖ చిత్రదర్శకుడు సింగీతం శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 5వ తేదీ నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని సింగీతం శ్రీనివాసరావు-కళ్యాణి దంపతులు దర్శించుకుని అమ్మవారికి అభిషేకం నిర్వహించి చీరను సమర్పించారు. ఆలయ ప్రధానార్చకులు ముళ్లపూడి హరిహరకుమార్‌శర్మ విశేషపూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ మర్యాదలతో పాలకమండలి సభ్యులు అయితా శ్రీధర్, దొరబాబురెడ్డి సింగీతం దంపతులను సత్కరించారు.

# ర్యాగింగ్‌పై కవిసమ్మేళనం




నెల్లూరులోని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 6వ తేదీ జిఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ర్యాగింగ్ అంశం మీద సభ, కవి సమ్మేళనం జరిగింది. ఈ సభలో ముఖ్యఅతిథులుగా నరహర, విజయభారతి, డా॥ పి.రాజామోహన్‌రెడ్డి, గుడిబండి వెంకటరెడ్డి, పొత్తూరు సుబ్బారావు, పెద్దూరి వెంకటదాసు, సాహితీ కిరణం పాల్గొని ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. గణపం రాజగోపాలరెడ్డి, సిరిమావిళ్ళ కోటేశ్వర రావు, ఆచార్య ఆదిత్య, కాలవపల్లి సహదేవయ్య తదితరులు ప్రసంగించారు. కవులు గుర్రాల రమణయ్య, గణపం రాజగోపాలరెడ్డి, సుశీలమ్మ, తోట సులోచన, ఎన్.దశరథ రామిరెడ్డి, సర్వేపల్లి ప్రభాకరరావు, అవ్వారు శ్రీధర్‌బాబు, గజల్ నారాయణరావు, ఊరుబిండి వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి, లావణ్యకుమారి, అమరా బాలగంగాధరరావు తమ కవితాగానంతో ర్యాగింగ్ భూతాన్ని పారద్రోలాలని కోరారు.

# నీళ్లు దొర్లించారు!

(మొదటి పేజీ తరువాయి)

పోలవరం ఓ పక్క మంజూరైవున్నా ప్రభుత్వం పట్టిసీమను చేపట్టడం వెనుక నారా లోకేష్‌బాబు ఆసక్తి ఉందనే ప్రచారం వుంది. పట్టిసీమ ద్వారా రాయలసీమకు నీళ్లిస్తామని చంద్రబాబు పదేపదే చెబుతూ వచ్చాడు. ఆగష్టు 15 నాటికి గోదావరి నీళ్లను కృష్ణాకు మళ్లిస్తామన్నాడు. అయితే ఆరోజుకు పనులు పూర్తి కాకపోవడంతో ఆ ప్రాజెక్టును జాతికి అంకితమిస్తున్నా నంటూ ఒక ప్రకటన చేసాడు. ఎట్టకేలకు మొన్న పోలవరం కుడికాలువలోకి తాడిపూడి ఎత్తిపోతల పథకం నుండి నీటిని వదిలారు. పట్టిసీమ వద్ద మోటార్లు, పంపులు ఏర్పాటు చేయకుండానే తాడిపూడి నుండి నీళ్ల వదిలి నదుల అనుసంధానం పూర్తయ్యిందంటూ తెలుగుదేశం నాయకులు సంబరాలు చేసుకున్నారు. తాడిపూడి జలాలను పోలవరంలోకి మళ్లించడంతో గోదావరి డెల్టా రైతులు తమకు నీళ్లు లేవంటూ గగ్గోలు పెడుతున్నారు. పట్టిసీమ మొత్తం ఎపిసోడ్‌లో పోలవరం కుడికాలు వదే ప్రధానపాత్ర. ఈ కాలువను వై.యే. హయాంలో నిర్మించారు. పోలవరం ప్రాజెక్ట్ వై.యస్. కల. ఆయన ఉండుంటే ఈ పాటికి ఆ ప్రాజెక్ట్ పూర్తయ్యి ఉండేది. ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయ్యే నాటికి కాలువలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో ఆయన ముందుగానే పోలవరం కాలువలను తవ్వించారు. ఇప్పుడు ఆ కాలువలే మేం పట్టిసీమ ద్వారా నదుల అనుసంధానం చేసామంటూ తెలుగుదేశం నాయకులు డప్పు కొట్టుకోవడానికి ఉపయోగపడ్డాయి. అలాగే వీళ్ల తాత్కాలికంగా నీళ్లు వదిలిన తాడిపూడిని కూడా పూర్తి చేసింది వై.యస్సే! పట్టిసీమ ప్రయోజనం తాత్కాలికమే. పోలవరం వస్తే దీని ఉపయోగం పెద్దగాఉండదు. పట్టిసీమ పేరుతో నిధులను వరదలా పారించారు. నీళ్లు మాత్రం ఊటకాలువలా పారుతున్నాయి.

# వాడవాడలా కృష్ణాష్టమి



కృష్ణాష్టమి పర్వదినాన్ని ఈ నెల 5వ తేదీ వాడవాడలా వైభవంగా జరుపుకున్నారు. నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేట వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కృష్ణ భగవానునికి తులసీదళార్చన కార్యక్రమాలు విశేషంగా నిర్వహించారు. శ్రీ మురళీకృష్ణ భక్త బృందం, కనకదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. దేవస్థానం ఛైర్మన్ మునగా వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు శేగుషణ్ముఖరావు, కార్యదర్శి మంచికంటి శ్రీనివాసులు, కోశాధికారి సాయిసువర్ణలు పర్యవేక్షించారు. సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ మందిర ఆలయ ప్రాంగణంలోని అష్టలక్ష్మి అమ్మవారి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఉభయకర్తలుగా టంగుటూరు రామిరెడ్డి-రమాదేవి, మెంటా వెంకటసుబ్బారావు-విజయలక్ష్మి దంపతులు వ్యవహరించారు. కామాటివీధి సంతాన గోపాలకృష్ణ మందిరంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. రాజేంద్రనగర్(కుక్కలగుంట)లోని మురళీకృష్ణ దేవస్థానంలో శ్రీకృష్ణ జయంతి వసంత సేవాహ్నిక బ్రహ్మోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. వేదాయపాళెం మహాత్మా గాంధీనగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో నేత్రపర్వంగా వేడుకలను నిర్వహించారు. మందిరకమిటీ ఆధ్వర్యంలో త్రయాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఆధ్యాత్మిక భాస్కర వాగ్భూషణ కోట కృష్ణమూర్తి కృష్ణలీలా వైభవంపై ప్రవచించారు. నవాబుపేట సెంటర్‌లో కృష్ణాష్టమి ఉత్సవ కమిటీ, యాదవయూత్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మాజీఎమ్మెల్యేలు బీద మస్తాన్‌రావు, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ తదితరులు పాల్గొన్నారు. ఫతేఖాన్‌పేట సకిలివారి వీధిలో శ్రీకృష్ణ భక్తబాల సంఘం ఆధ్వర్యంలో మద్దూరి ప్రసన్నరత్నం తదితరులు శ్రీకృష్ణాష్టమి వేడుకలు పర్యవేక్షించారు. జేమ్స్‌గార్డెన్‌లో శ్రీకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో వేడుకలు వైభవంగా నిర్వహించారు. మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, కావలి మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు మాగుంట లే అవుట్‌లో వున్న రెయిన్‌బో పాఠశాలలో ఈ నెల 5వ తేదీ శ్రీకృష్ణాష్టమి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. పాఠశాల డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం, అరుణ స్వయంప్రభ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

మాదరన్ స్కూల్‌లో కృష్ణాష్టమి పండుగను పురస్కరించుకుని విద్యార్థినీ విద్యార్థులు కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలతో అత్యంత వేడుకగా నిర్వహించారు. బాలబాలికలు కోలాటాలు, నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఒకరి నేత్రదానంతో ఇరువురికి కంటి చూపు




ఒకరి నేత్రదానంతో ఇరువురి జీవితాలకు కంటిచూపును ప్రసాదించవచ్చని నెల్లూరుజిల్లా అదనపు జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరులో నేత్రదానంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఐఎంఏ హాలు వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ దాతల కంటిలోని నల్లటి కార్నియా అనే పొరను మాత్రమే సేకరించి మిగిలిన గుడ్డును అలాగే ఉంచుతామని తెలిపారు. ఈ ప్రక్రియ కేవలం 20నిమిషాల్లో పూర్తవుతుందని పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ దేవికి వెంకటలక్ష్మి మాట్లాడుతూ దేశంలో కార్నియా అవసరమైనవారు 12లక్షల మంది ఉన్నారన్నారు. మట్టిలో కలిసిపోయే అవయవాలను దానం చేయడం ద్వారా మరొకరి జీవితాన్ని కాపడవచ్చన్నారు. జిల్లా అంధత్వ నివారణ అధికారిణి డాక్టర్ మంజులమ్మ మాట్లాడుతూ దేశంలో ఏడాదికి కోటిమంది మరణిస్తున్నారని, వారిలో కేవలం రెండు శాతం మంది మాత్రమే నేత్రదానం చేస్తున్నట్టు తెలిపారు. నేత్రదానంలో జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో వుందని, ప్రథమస్థానంలోకి తీసుకెళ్ళేందుకు అందరూ సహకరించాలన్నారు. అనంతరం నేత్రదానంపై అవగాహన గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, డిసిహెచ్ సుబ్బారావు, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ భారతి, ఐఎంఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసతేజ, డాక్టర్ జ్యోతి, స్వచ్ఛంద సంస్థల జిల్లా అధ్యక్షులు ఇవిఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 'భూం'ఫట్

(మొదటి పేజీ తరువాయి)

ఇక్కడి రైతులు గగ్గోలు పెడుతున్నారు. అయినా పారిశ్రామికీకరణ పేరుతో సర్కార్ భూములను వదలడం లేదు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశాలున్న అన్ని ప్రాంతాల్లో చంద్రబాబు కంపెనీ ల్యాండ్ బ్యాంకును సిద్ధం చేసుకుంటోంది.

అంతేగాక అసలు పారిశ్రామికాభివృద్ధి అంచనాలు లేని ప్రాంతాల్లో కూడా ప్రభుత్వ భూములన్నింటిని ఏపిఐఐసి పరిధిలోకి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి జిల్లాలోనూ పారిశ్రామికాభివృద్ధి పేరుతో ఈ ప్రక్రియ జరుగుతోంది. రాష్ట్రంలో పేదలకు పంచగా మిగిలిన భూములన్నీ కూడా ఏపిఐఐసి ఆధీనంలో ఉంటాయి. ఈ కాలం ముగిసేలోపు ఆయా కంపెనీలకు పరిశ్రమల పేరుతో వేలాది ఎకరాలను ధారాదత్తం చేయవచ్చు. ఇదీ చంద్రబాబు అండ్ కో కంపెనీ భవిష్యత్ ఆలోచన.

రాష్ట్రానికి ఇంతవరకు ఒక్క పరిశ్రమ రాలేదు. వచ్చిన ఒకటి అరా పరిశ్రమలు కూడా వెనక్కి వెళ్లాయి. మనకంటే కూడా తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకే పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ఇక్కడ ఒక్క పరిశ్రమ లేకున్నా లక్షల ఎకరాల భూ బ్యాంకును సిద్ధం చేస్తున్నారు. ఈ భూ బ్యాంక్ వెనుక ఆర్థిక ప్రయోజనాలు భారీగానే వున్నాయి.

వై.యస్ హయాంలోనూ రాష్ట్రంలో భారీగానే భూసేకరణ జరిగింది. అయితే ఆయన హయాంలో జరిగిన భూసేకరణ వల్ల ఎవరూ నష్టపోలేదు. వ్యవసాయ యోగ్యత కాని భూములను సెజ్‌లకు సేకరించారు. దీనివల్ల ఆ పొలాల రైతులకు నాలుగు రూపాయలు వచ్చాయి. పరిశ్రమలు రావడంతో ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందాయి. పరిశ్రమలు రావడం వల్ల రాజకీయ నాయకులూ లాభపడ్డారు. వై.యస్.హయాంలో జరిగిన భూసేకరణ వల్ల మేం నష్టపోయాం అన్న వారు లేరు.

కాని ఇప్పుడు జరుగుతున్న భూసేకరణ వల్ల మాత్రం రైతులు నష్టపోతున్నారు. పరిశ్రమలు రాకపోతుండడంతో రాష్ట్రంలో ఇతరులకు కూడా ఎటువంటి ప్రయోజనాలుండడం లేదు.

# ఒత్తిడి లేని విద్యకు స్వాగతం




పిల్లలను బట్టీ విధానానికి దూరం పెడుతూ నేషనల్ కరికులమ్ ఫ్రీ వర్క్(ఎన్‌సిఎఫ్-2015) సూచనల మేరకు ఒత్తిడి లేని విద్యా విధానాన్ని అవలంబించాలనే ఉద్దేశ్యంతో గత సంవత్సరం నూతన సిలబస్‌ను ప్రారంభించారని దానిని స్వాగతిస్తున్నామని నెల్లూరుజిల్లా ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు బి.మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీన నెల్లూరులోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరంతర సమగ్ర మూల్యాంకన పద్ధతిలో పిల్లల ప్రగతిని పరీక్షించే విధానం అమలు జరగాల్సి వుందన్నారు. ప్రభుత్వం ఈ సంవత్సరం నుండే 9వ తరగతిలో ఈ నూతన విధానాన్ని ప్రవేశపెట్టనుందని, వచ్చే సంవత్సరం పదో తరగతి లోనూ ప్రవేశ పెట్టాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. దీనిపై తమ సంస్థ ఉపాధ్యాయులకు ఇప్పటికే రెండుసార్లు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. సహపాఠ్యాంశాలైన పనివిద్య, నైతిక విద్య, సంగీతం, నృత్యం, ఆటలు, వ్యాయామ విద్య, ఆరోగ్యవిద్య అంశాలపై పుస్తక రచన పూర్తయ్యిందని, ఇంత వరకు ముద్రణకు నోచుకోలేదని, వెంటనే ముద్రించి పాఠశాలలకు అందుబాటులోకి తేవాలన్నారు. సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు యం.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రతి సంవత్సరం 500 రూపాయలు చెల్లించి ఫైర్ సర్టిఫికేట్ రెన్యూవల్ చేసుకోవాలని ఉత్తర్వులు ఉన్నాయని, 2010 నుండి దానిని 10వేలకు పెంచడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై.వెంకటరామయ్య, నెల్లూరు నగర అధ్యక్షులు ఎం.శౌరెడ్డి, నగర కార్యదర్శి రవి కుమార్, నగర ట్రెజరర్ కృష్ణారావు, ఎగ్జామ్స్ కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసులు, వాకాటి విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## చిన్నారికి ప్రాణం పోసారు



ఆడుకుంటూ పిన్నీసు మింగిన రెండేళ్ళ చిన్నారిని నెల్లూరు అపోలో వైద్యులు బ్రతికించారు. అన్నవాహిక నుంచి పిన్నీసును తీసి చిన్నారికి పునర్జన్మ ప్రసాదించారు. ఈ సంఘటన బుధవారం జరిగింది. విలేకర్లతో ఇఎన్‌టి డాక్టర్ ఎస్.సతీష్ కుమార్ ఈ అరుదైన సంఘటన గురించి వివరించారు. నెల్లూరు శివారు కొత్తూరు టైలర్స్‌కాలనీకి చెందిన సమియ అనే రెండేళ్ళ బాలిక మంగళవారం ఆడుకుంటూ సేఫ్టీపిన్నీసును మింగేసింది. దీంతో కంగారుపడ్డ తల్లిదండ్రులు చిన్నపిల్లల ఆసుపత్రులకు బిడ్డను తీసుకెళ్ళగా వారు చెన్నై తీసుకెళ్ళమన్నారు. ఈ క్రమంలో వారు అపోలో ఆసుపత్రికి తీసుకురావడంతో ఆ బిడ్డకు ఎక్స్‌రే తీయించి, పిన్ను ఎక్కడ ఉందో గుర్తించామన్నారు. రిజిడ్ ఎండోస్కోపి పరీక్ష చేసి కుట్లు పడకుండా తేలిగ్గా ఆ పిన్నును బయటకు తీసామని, పాప క్షేమంగా ఉందన్నారు. అనస్థీయన్ డాక్టర్లు వంశీధర్, దిలీప్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డా॥ శంకరనారాయణ, డా॥ శ్రీధర్‌లు సహకారం అందించారని సతీష్ తెలిపారు.



## అత్యంత సుందరంగా ముస్తాబై...

# ప్రారంభమైన బి.ఎం. కన్వెన్షన్‌హాల్

నెల్లూరుజిల్లాలో చిన్నస్థాయి శుభవేడుకల నుండి భారీ వేడుకల దాకా ఎలాంటి ఫంక్షన్‌లు, ప్రోగ్రామ్‌లకైనా అవసరమైన హైరర్స్‌ను, లైటింగ్‌ను సమకూర్చగల సంస్థ రియాజ్ హైరర్స్ అండ్ హైదరాబాద్ లైటింగ్ హౌస్. ఈ సంస్థ అధినేత రియాజ్ బాషా తన సేవలతో నగర ప్రజలకు సుపరిచితుడయ్యారు. తన వ్యాపార విస్తరణలో మరో ముందడుగు వేస్తూ నెల్లూరీయులకు సౌకర్యవంతంగా, ఆహ్లాదంగా వేడుకలు జరుపుకోవడానికి ఓ ఫంక్షన్‌హాలును అందుబాటులోకి తెచ్చారు. నెల్లూరు, దర్గామిట్ట, కస్తూర్భా కళాక్షేత్రం ఎదురుగా గల ఒయాసిస్ సెంటర్‌లో అత్యంత అందంగా, ఆకర్షణీయంగా బి.యం.కన్వెన్షన్ హాల్‌ను తీర్చిదిద్దాడు రియాజ్ భాయ్. ఈ హాల్‌ను ఈ నెల 6వ తేదీన నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రారంభించి, నెల్లూరు ప్రజలకు ఇంతమంచి హాల్‌ను అందుబాటులోకి తెచ్చిన రియాజ్ బాషాను అభినందించారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎస్.కె.జలీల్‌అహ్మద్, లాయర్ వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, సిపిఆర్ కల్యాణ మండపం అధినేత చెరుకుపల్లి పద్మనారాయణరెడ్డి, మురళీకృష్ణ హోటల్స్ అధినేత వి.హజరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు. వచ్చిన అతిథులకు హాల్ అధినేతలు రియాజ్ భాషా, పి.అబ్దుల్ మునీర్, జాఫర్ మొహిద్దీన్‌లు ఆత్మీయంగా స్వాగతం పలికారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com